


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 63 పేజీలు: 8+4 వెల: 6.50



ఫార్మా ఉత్పత్తులపై 100% ట్రంప్ టారిఫ్ 2లో

విధ్వంసం వదిలి చర్చల వైపు రావాలి: యుఎన్ 5లో


# ఇది టెక్స్‌టైల్ రాజధాని

## నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామి

### ఉన్నతశ్రేణి వస్త్రాల తయారీ రాష్ట్రం సొంతం

### ప్రతిదేశంలో ఇక్కడి దుస్తులే ధరించాలి

### తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి

### ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం హైదరాబాద్‌లో 13వ అటెక్స్‌కాన్-2026 సదస్సులో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్3:** తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉందని, అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతుందని చెప్పారు. శుక్రవారం హైటెక్స్‌లో ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్-2026లో ఆయన మాట్లాడారు. టెక్స్టైల్ రంగ ప్రముఖులందరికి తెలంగాణ, హైదరాబాద్‌కు స్వాగతం పలుకుతోందన్నారు. 13వ అటెక్స్‌కాన్-2026 సదస్సులో పాల్గొంటున్న మీరు కేవలం అతిథులు మాత్రమే కాదు, మా అభివృద్ధి భాగస్వాములు, మా విజన్‌ను పంచుకునే స్నేహితులు అని పేర్కొన్నారు. అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉందని, శాతాబ్దాలుగా కళలు,సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్‌ను సంపూర్ణంగా తీర్చిద్దామన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా మా సంప్రదాయం ప్రకారం తెలంగాణ ముఖ్య మంత్రి హోదాలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి పవిత్ర వస్త్రాలను సమర్పించడం నాకు గౌరవం అన్నారు. తెలంగాణ డిఎన్ఏలోనే టెక్స్‌టైల్ ఉందని గర్వంగా చెప్పుకోవచ్చని పేర్కొన్నారు. నిజాం కాలంలో ప్రపంచం నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసే వారని పేర్కొన్నారు. 'ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ నుండి గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ నుండి నారాయణపేట చేనేత >>2

## పబ్‌లపై 'ఈగల్' మెరుపు దాడులు

### కొండాపూర్‌లో 8మందిపై కేసు నమోదు

### పాజిటివ్ వచ్చిన వారిలో ఓ ఐఎఎస్ కుమారుడు!

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** డ్రగ్స్ నియంత్రణలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఈగల్ టీమ్ తన మెరుపు దాడులను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో నగరంలోని పబ్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈగల్ టీమ్ గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. కొండాపూర్ లోని క్వాక్ ఏరినా పబ్‌లో బ్లాక్ ఏరినా పేరుతో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ డిజె నైట్ ప్రోగ్రాంలో పాల్గొన్న వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8మందికి డ్రగ్స్ పాజిటీవ్ రావడంతో వారి మీద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా పాజిటీవ్ వచ్చిన వారిలో ఓ ఐఎఎస్ కుమారుడు ఉన్నాడనే సమాచారం సంచల నంగా మారింది. గచ్చిబౌలి >>2

## పగలు ఎండ.. రాత్రి వాన

### రాష్ట్రంలో విభిన్న వాతావరణం

### మరో మూడు రోజులు అకాల వర్షాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండావానలతో కూడిన విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలు దంచి కొడుతుండగా సూర్యుడు అస్తమించగానే వరుణుడు విరుచుకుపడుతున్నాడు. దీంతో పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, సగటు సముద్రమట్టానికి 1.5నుంచి 3.1కి.మీఎత్తులో ఇది >>2

## జీవన్‌రెడ్డి త్వరలో బిఆర్ఎస్‌లోకి!

### కెటిఆర్ సమక్షంలో చేరే అవకాశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్3:** ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వా నించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో బిఆర్ఎస్ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగివచ్చిన వెంటనే కేటీఆర్ జీవన్‌రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వా >>2

## వచ్చే వారమే రైతు భరోసా



### రెండో విడత పంపిణికి సిఎం ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రైతుభరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల క్రితమే మొదటి విడత నిధులు విడుదల చేసిన ప్రభుత్వం రెండో విడత రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన రూ.2,650 కోట్ల నిధులను సమీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు ఉద్యోగుల జీతాలు, అప్పులకు చెల్లించాల్సిన వడ్డీలు పోనూ మిగిలిన వాటిని రైతు భరోసా రెండో విడతకు మళ్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. మొత్తం మూడు విడతల్లో యాసంగి రైతు భరోసా నిధులను జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో భాగంగా మార్చి 22నఎకరం వరకు భూమి ఉన్న రైతులకు రూ.3,590 కోట్లను చెల్లించింది. దీంతో సుమారు 70 లక్షల మంది రైతుల అకౌంట్లలో రైతు భరోసా నిధులను ఎకరాకు రూ.6వేల చొప్పున జమ చేసింది. రెండో విడత నిధులను ఈనెల 2వ వారంలో జమచేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఈసారి ఎకరం కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు నిధులు జమ అయ్యే అవకాశం ఉంది. దాదాపు 5 ఎకరాల విస్తీర్ణం వరకు రెండో దఫాలో నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇక ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు చెల్లించాల్సిన నిధులను ఈ నెల చివరి వారంలో చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి సీజన్‌లో రైతులకు ఎకరాకు రూ.6వేలచొప్పున పంటసాగు కోసం ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం రూ.9 వేల కోట్ల వరకు వెచ్చిస్తోంది. నిజానికి గతంలో ఒకేసారి రైతు భరోసా చెల్లించినప్పటికీ ఆర్థిక వనరుల కొరత కారణంగా ఈసారి మూడు దఫాలుగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నేరుగా రైతుల ఖాతాలకే నగదు బదిలీ చేయడం ద్వారా పారదర్శకతను కాపాడుతున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం యాసంగి వ్యవసాయపంట కోతల పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రైతు భరోసా నిధులు అన్నదాతలకు ఆర్థిక ఊరటనిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కాంగ్రెస్ లక్ష్యం

### అక్కడ తెలంగాణ తరహాలో అభివృద్ధి, సంక్షేమం

### ఒబిసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల స్కాలర్ షిప్‌లు రెట్టింపు

### తెలంగాణ పథకాలే పుదుచ్చేరిలోనూ అమలు: డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

**హైదరాబాద్,ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కాంగ్రెస్ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. పుదుచ్చేరిలోని మనవేలి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనంతరామన్ కు మద్దతుగా ,ఎంబాలం నియోజకవర్గంలో లక్ష్మీకాంతన్ కు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. పుదుచ్చేరిలో తెలంగాణ తరహాలో అభివృద్ధి,సంక్షేమతో ప్రజారంజక పాలన అనుభవించడానికి ఇక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా ఓటు వేస్తున్నారని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క,రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ద్వంద్వ "సెస్" రాజన్‌ను పుదు చ్చేరిలో ఇక అంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తోందని పన్నుల రాబడిలో రాష్ట్రానికి సరైన వాటాను నిర్ధారిస్తామని, యూనియన్‌సెస్ సర్‌చార్జీలు 5శాతంకు పరిమితం చేయడానికి చట్టం కూడా తీసు >>2



శుక్రవారం పుదుచ్చేరిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

## పాత పేరుతో కొత్త అజెండా!

### టిఆర్ఎస్ పేరు ఎవరైనా వాడుకోవచ్చు: కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్3:** పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని, ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చని తెలిపారు. ఆడబిడ్డకు ఓటు వేయాలన్న అంశం కంటే మించిన ఎమోషన్ ఏముంటుందని ప్రశ్నించారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ >>2

## ఐఎన్‌ఎస్ తారాగిరి జలప్రవేశం

### నేవీ అమ్ముల పొదిలోకి అత్యాధునిక అస్త్రం



శుక్రవారం విశాఖలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్ సింగ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ఆత్మనిర్బర్ భారత్‌తో దేశం శరవేగంగా దూసుకెళ్తోంది. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో కీలక ముందడుగు పడింది. నౌకాదళ అమ్ముల పొదిలో మరో అత్యాధునిక అస్త్రం చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన స్టెల్త్ ఫ్రిగేట్ యుద్ధనౌక ఐఎన్ఎస్ తారాగిరి జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్‌డాక్‌యార్డులో శుక్రవారం ఈనౌకను కేంద్రరక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితంచేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్,నేవీ చీఫ్ దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముంబయిలోని మజగావ్ డాక్స్ లిమిటెడ్ నిర్మించిన ఈ యుద్ధ నౌక సముద్ర రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి17 ఏలో ఇది నాలుగోది. ఆత్మనిర్బర్ భారత్‌లో భాగంగా 75 శాతానికిపైగా స్వదేశీ సాంకేతిక పారిశ్రామిక రక్షణ ఉత్ప త్తుల తయారీ సంస్థలు ఇందులో భాగస్వామ్యమైనట్టు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్ >>2



తారాగిరి జలనప్రవేశ దృశ్యం



## భారంగా భావించి.. బావిలో పడేసి..

### కవలలను కడతేర్చిన తండ్రి

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** కరీంనగర్ మండలం జూబ్లీ నగర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కంటికి రెప్పలా కాపాడా ల్సిన తండ్రి ఆడపిల్లలు భారంగా భావించి కడతేర్చిన ఘటన ఉదయ విధారకంగా మారింది. జూబ్లీనగర్ గ్రామానికి చెందిన కచ్చు శ్రీశైలంకు 6యేళ్ల క్రితం మానకొండూరు మం డలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క రాజమల్లు కుమార్తె మోనిక తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు కవలలు, గీతాంశీ, గీతాన్విక 4 సంవ త్సరాలు. ఇద్దరూ ఆడపిల్లలే కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవల జరుగుతుండేవి. ఈ క్రమంలో పిల్లలు ఇద్దరినీ తీసుకొని పొలం వద్దకు వెళ్లిన శ్రీశైలం పిల్లలు ఇద్దరినీ హతమార్చాడు. >>2

## రుణ మాఫీ 100% అయిందా?

### కొడంగల్‌లోనే ఏ గ్రామానికైనా వెళ్లి అడుగుదాం

### నిజంగా ఎంత జరిగిందో తెలుసుకుందాం

### రంగారెడ్డి ఎత్తిపోతలు బిఆర్ఎస్ పుణ్యమే

### మీడియాతో హరీష్‌రావు



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న హరీష్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడేది అన్నీ అబద్ధాలేనని, రుణమాఫీ ఎక్కడ జరిగిందో చూపించాలని తన సొంత నియోజకవర్గ కొడం గల్ లోని ఏ గ్రామానికి అయినా వెళ్దామని మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్ విసిరారు. నారాయణపేట జిల్లాఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు ఆరాధ్య దైవమైన గురులోక మాసంద్ (బావోజి జాతర)కు బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు హరీష్ రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్, రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందే బిఆర్ఎస్ పార్టీ అని గుర్తు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం బిఆర్ఎస్ పార్టీ ప్రారంభిస్తే కావాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆపడం జరిగిందని అన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని అబద్ధాలే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం నిజం కాదా అని నేను కొడంగల్ లోనే ఉన్న ఈ ప్రాంత గ్రామాలకు వెళ్దాం దా.. అని సవాల్ విసిరారు. ఈ ప్రాంత గిరిజనుల భూములు తీసుకొని వారిపై ఎన్నో కేసులు వేయడం జరిగిందని తెలిపారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్ట్ పనులు చేపట్టడం జరిగిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయని ఆరు పథకాలను కేరళ రాష్ట్రంలో అమలుపరుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా కేరళ ప్రజలకు తెలపడం శోచనీయంగా ఉందని ఎద్దేవా చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా బిఆర్ఎస్ పార్టీ విద్య, వైద్యంలో 10 రిజర్వేషన్ కల్పించడం,వైన్స్ దుకాణాలలో గౌడన్నలకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. గిరిజనులు రాజకీయంగా అభివృద్ధి చెందాలనే భావంతో ప్రతి తాండను గ్రామ పంచాయతీలుగా మార్చడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు పేద ప్రజల కోసం మనిషి పుట్టుక నుండి మరణించే వరకు ఉపయోగపడే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని అన్నారు.



శుక్రవారం కువైట్‌లో చమురు శుద్ధి కర్మాగారంపై ఇరాన్ క్షిపణి దాడి జరిపిన దృశ్యం

## అమెరికా ఫైటర్ జెట్ల కూల్చివేత

### గల్ఫ్‌దేశాల్లోని 8 వంతెనలు కూల్చివేయాలని ఇరాన్ టార్గెట్

### హార్ముజ్ జలసంధిని తెరిపించి తీరుతాం: ట్రంప్

### ట్రంప్‌కు ఆయన స్టైల్‌లోనే జవాబిస్తాం: ఇరాన్ 2లో



టెక్స్‌టైల్ సదస్సు,ఎగ్జిబిషన్‌లో మగ్గం నేతను పరిశీలిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

# ఇది టెక్స్‌టైల్ రాజధాని

>> వరకు అనేకం ఇక్కడ ఉన్నాయి' అని చెప్పారు..తెలంగాణ టెక్స్టైల్ రంగంలో ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలు ఉన్నాయని వివరించారు. భారతదేశంలో పత్తి ఉత్పత్తిలో మేము అగ్రగాములం. మన పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరు ఉందని చెప్పారు. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాము – ఇందులో అనేక అపారెల్ పార్కులు ఉన్నాయన్నారు.టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు, చేనేతలకు జీవితం అని పేర్కొన్నారు. తెలంగాణలో నైపుణ్యం కూడా ఉంది, సంకల్పం కూడా ఉందని తెలిపారు. డీప్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్,మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ ఇలా అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. మా విజన్ తెలంగాణ రైజింగ్ 2047... 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం మా విజన్ అని పేర్కొన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. టెక్స్టైల్ రంగంలో మాకు ఒక విజన్ ఉంది. 2047 నాటికి తెలంగాణను దక్షి ణ ఆసియాలో టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మా ప్రభుత్వం మీకు మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలలతో పాటు వేగంగా అనుమతులు మంజూరు చేస్తుందని, ప్రపంచానికి సరితూగే విధానాలు మా వద్ద ఉన్నాయన్నారు. అత్యుత్తమ మానవ వనరులు మా బలం, మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములు. కలిసి, ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం అని చెప్పారు. తెలంగాణ పత్తి పొలాల నుండి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో మేం కలిసి పనిచేస్తున్నాం అని చెప్పారు. హైదరాబాద్ భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచానికి కూడా సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందన్నారు. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించింది. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయి – ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరింది. సినిమా రంగం తమ ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే పొందేలా ప్రోత్సహిస్తాము అని వివరించారు. పర్యావరణ పరిరక్షణ మా అత్యున్నత ప్రాధాన్యం. గ్రీన్ టెక్స్టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాము.యువతకు, ముఖ్యంగా మహిళలకు, శిక్షణ అందిస్తాము. సంప్రదాయ ఆలోచనలను ఆధునిక టూల్స్‌తో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో ఉపయోగించేలా చేస్తాము అని చెప్పారు. ప్రపంచానికి వ్యాక్సిన్లు, ఔషధాలు అందించిన రాష్ట్రం మనది. ఆపిల్ ఇయర్‌పాడ్స్ కూడా ఇక్కడే తయారవుతున్నాయని చెప్పారు. ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి దేశంలో తెలంగాణలో తయారైన దుస్తులు ధరించేలా చేయాలని మా లక్ష్యం.పెట్టుబడిదారులకు నా పిలుపు ఇదే.. మేము కేవలం ఒక రాష్ట్రం కాదు, విజయవంతమైన భాగస్వాములం ..కలిసి ఒక కొత్త భవిష్యత్తును నిర్మిద్దాం అని పేర్కొన్నారు. ప్రసంగానికి ముందు ఏషియన్ టెక్స్ టైల్స్ కాన్ఫరెన్స్–2026లో రీమేజినింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ గ్లోబల్ టెక్స్ టైల్స్ పైన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌కు మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు,దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, టెక్స్ టైల్ రంగ ప్రముఖులు హాజరయ్యారు.

# అమెరికా ఫైటర్ జెట్ల కూల్చివేత

**టెహ్రాన్, జెరూసలెం,వాషింగ్టన్, ఏప్రిల్ 3:** రోజురోజుకూ ఉధృతం అవుతున్న ఇరాన్ యుద్ధం వ్యూహాలు మారుతున్నాయి. ముందురోజు ఇరాన్‌లోని బీవన్ వంతెనను ఇజ్రాయెల్, అమెరికా సేనలు కూల్చివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. గల్ఫ్ మండలిలోని దేశాల్లో కీలకంగా ఉన్న ఎనిమిది వంతెనలనున పేల్చివేస్తామని ఇరాన్ అల్టిమేటమ్ జారీచేయడంతో గల్ఫ్‌దేశాల్లో ఆందోళన మొదలయింది. అలాగే యుద్ధంలో ఇరాన్ తన ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ఎఫ్–35 యుద్ధవిమానాన్ని సైతం కూల్చివేసినట్లుప్రకటించింది. అంతేకాకుండా పారాచ్యూట్‌ల సాయంతో కిందకు వచ్చిన పైలట్‌ను కూడా తమ అదుపులోనే ఉంచినట్లు ఇరాన్‌ప్రకటించడంతో అమెరికా ఇపుడు మరింత గందరగోళపరిస్థితిని ఎదుర్కొంటున్నది. వరుసగా అమెరికా రెండో యుద్ధవిమానం కూల్చివేసామని ప్రకటించింది. ఇదిలా ఉంటే నెలరోజులకుపైగా ఇజ్రాయెల్; అమెరికాలు దాడులుచేస్తున్నా ఇరాన్ సైనికసామర్థ్యం ఇప్పటికీ పటిష్టంగానే ఉందని అమెరికానిఘా వేగులు శ్వేతసౌధానికి నివేదిక ఇచ్చారు. దీనితోఅమెరికా మరింతగా ఒత్తిడికి లోనయింది. పెద్దసంఖ్యలో క్షిపణులున్నాయని, తీరప్రాంత రక్షణ క్రూయిజ్ క్షిపణులు ఇరాన్‌వద్ద లెక్కకుమించి ఉన్నట్లు యుఎస్ నిఘా సంస్థలు నివేదిక అందించాయి. యుద్ధం కొనసాగింపులో సరైన రక్షణ వ్యూహం అనుసరించలేదన్న భావనతో అమెరికా ఆర్మీచీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ రాండీ జార్జిని తక్షణమే పదవినుంచి దిగిపోవాలని రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ ఆదేశించడం పెంటగాన్‌లో కలవరం కలిగించింది. వచ్చే మూడువారాల్లో మరింత తీవ్రస్థాయిలో మా దాడులుంటాయని ప్రకటించిన ట్రంప్‌నకు ఆయన స్టైల్‌లోనే జవాబిస్తామని ఇరాన్‌ప్రకటించింది. అలాగే అమెరికా మిత్రదేశాలపైనా దాడులు ముమ్మరంచేసింది. సౌదీలో అత్యంత ఖరీదైన రాడార్‌ను ధ్వంసంచేయగా దుబాయ్‌లోని ఒరాకిల్ డేటాసెంటర్‌పైనా దాడిచేసినట్లు ఇరాన్ ప్రకటించుకుంది. అమెరికా విధించే ఆంక్షలకు ఇరాన్ ఎప్పటికీ లొంగదని అవమానకరరీతిలో ట్రంప్ దిగిపోవడమే తమ లక్ష్యమని ప్రకటించారు. యుద్ధంపై చర్చలకు రావాలంటే తమ షరతులు అంగీకరించాల్సిందేనని విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చి ప్రకటించారు. కువైట్‌లోని ప్రధాన చమురుశుద్ధికర్మాగారంపైనా ఇరాన్ క్షిపణులు దాడులుచేసాయి. ఇదిలా ఉంటే దాడులు ముమ్మరంచేసేందుకుగాను అమెరికా తన వ్యూహాలను మరింతపటిష్టంచేస్తోంది. పదాతి దళం కదలికలకోసం ప్రత్యేక రహదారులనే నిర్మించుకుంటోంది. ఈ దాడులతోనే యుద్ధం ముగిస్తామని ట్రంప్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగాయుద్ధంకోసం అమెరికాలో అత్యంత ప్రసిద్ధమైన యుఎస్ జెరాల్డ్‌ఫోర్డ్ మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి తరలివచ్చింది. సైనిక దళాలతోపాటు విమానాలు, ఇతర క్షిపణులుసైతం ఈ నౌకనుంచేప్రయోగించే వెసులుబాటు ఉంది. హార్ముజ్ జలసంధిని తెరిపించి తీరుతామని ప్రకటించినట్రంప్ ఆదిశగానే తన ప్రయత్నాలను ముమ్మరంచేస్తున్నారు.

## ఇజ్రాయెల్ చట్టంపై భగ్గుమన్న ముస్లిం దేశాలకూటమి



**దుబాయి, ఏప్రిల్ 3:** మధ్యప్రాచ్యంలో ముదిరిన ఉద్రిక్తతలు ఇప్పుడు కొత్త మలుపు తిరిగాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లకు మరణశిక్ష విధించేలా ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెస్సెట్) ఆమోదించిన నూతన చట్టంపై ముస్లిం ప్రపంచం భగ్గుమంది. ఈ చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తూ పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ సహా ఏడు కీలక ముస్లిం దేశాలు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్, ఇండోనేషియా, జోర్డాన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల విదేశాంగ మంత్రులు ఈ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. పా ఇజ్రాయెల్ తీసుకొచ్చిన ఈ చట్టం అంతర్జాతీయ చట్టాలకు, ప్రాథమిక మానవ హక్కులకు పూర్తి విరుద్ధమని వారు స్పష్టం చేశారు. ఈ చట్టం మధ్యప్రాచ్యంలో శాంతి ప్రక్రియను పూర్తిగా దెబ్బతీస్తుందని, ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తుందని వారు హెచ్చరించారు. ఈ కొత్త చట్టాన్ని పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా ఇజ్రాయెల్ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆ ఏడు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వెస్ట్ బ్యాంక్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని, వారిని వివక్షాపూరితంగా శిక్షించేందుకు ఈ చట్టాన్ని ముసుగులా వాడుకోవచ్చని పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ విధానాలు పాలస్తీనా ఉనికికే సవాలు విసురుతున్నాయని, ఇది అణచివేతకు పరాకాష్ట అని ఆరోపించాయి. ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీల దుస్థితిపై కూడా ఈ సంయుక్త ప్రకటనలో ముస్లిం దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఖైదీలపై జరుగుతున్న అమానుష దాడులను ఈ దేశాలు ఎండగట్టాయి. ఇజ్రాయెల్ జైళ్లలో ఖైదీలను చిత్రహింసలకు గురి చేయడం, ఆహార కొరత సృష్టించడం జరుగుతుందన్నారు.

## పగలు ఎండ..రాత్రి వాన

>> విస్తరించి ఉందని తెలిపింది. ఈ ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారి చేసింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. సోమవారం కూడా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాదన వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రైతులు పశువులను చెట్ల కింద కాకుండా రక్షిత షెడ్లలో ఉంచాలని, తుఫాన్లు వస్తున్నపుడు విద్యుత్ స్తంభాలు, బోరుబావులు, దూరంగా ఉండాలన్నారు.

# జీవన్‌రెడ్డి త్వరలో బిఆర్‌ఎస్‌లోకి

>> నించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. బిఆర్‌ఎస్‌లో చేరితే స్థానికంగా బీఆర్‌ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. మార్పు రావాలి...రేవంత్‌రెడ్డి పోవాలి: కాగా, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాల జిల్లాలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిరక్ష ్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు.

# పబ్‌లపై 'ఈగల్' మెరుపు దాడులు



>> పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు కథనం ప్రకారం. గచ్చిబౌలి పరిధిలోని పలు పబ్‌లలో డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న తెలంగాణ ఈగల్ టీమ్ గచ్చిబౌలి పోలీసులతో కలిసి డ్రగ్స్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు కలిసి కొండాపూర్‌లోని క్వాక్ ఏరినా పబ్ మీద గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. క్వాక్ ఏరినా పబ్‌లో గురువారం రాత్రి బ్లాక్ ఏరినా పేరుతో ఇంటర్నేషనల్ డిజే నైట్ ప్రత్యేక ప్రోగ్రాం కొనసాగుతుంది. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న మొత్తం 64మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈవెంట్‌కు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూసిన పోలీసులు బ్యాచ్‌లుగా విడిపోయి పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొదట 4గురికి డ్రగ్స్ పరీక్షల్లో గంజాయి, బెన్‌జోడియాజిపెన్ డ్రగ్స్ పాజిటీవ్ వచ్చింది. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో మరో నలుగురికి సైతం గంజాయి మెథంపెటమైన్ డ్రగ్స్ పాజిటీవ్ వచ్చింది. దీంతో 8మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిలో వ్యాపారవేత్త మౌనిష్ ఉమేష్, కాంట్రాక్టర్ ప ృథ్వీరాజ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అభిషేక్, ఆకేళ్ల హరిత్ సారంగా, వ్యాపారి రిషబ్, ఉబేర్ అనలిస్టు రిత్విక్, మొబైల్ షాపు నిర్వాహకుడు రితేష్, జ్యోతిరాదిత్యలు ఉన్నారు. ఈ సందర్భంగా పట్టుబడిన 8మంది డ్రగ్స్ తీసుకున్నట్లు అంగీకరించారు. వీరి వివరాలను తీసుకున్న పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా పట్టుబడిన ఆకేళ్ల హరిత్ ఓ మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడని ప్రచారం సాగుతుండగా, పోలీసులు దీన్ని ద ృవీకరించలేదు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కాంగ్రెస్ లక్ష్యం

>> కొస్తామని తెలిపారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పుదుచ్చేరిలో యువతకు ప్రభుత్వరంగంలో ఉపాధి కల్పిచడంతోపాటు, ఐటి సెక్టార్‌లో ఉపాధి పొందేందుకు నైపుణ్యం పెంపొందిం చడానికి కృషిచేస్తామమని హామి ఇచ్చారు.ప్రజా స్వామ్యాన్ని పరిరక్షణ కు, రాజ్యాంగం మనకు కల్పించిన గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే కాంగ్రెస్, డిఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థు లను భారీ మెజారిటీ తో గెలిపించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే ఒబిసి,బిసి ఎస్‌సి ఎస్‌టి విద్యార్థుల స్కాలర్‌షిప్ రెట్టింపు చేస్తామని తెలి పారు. ప్రతి జిల్లాలో అంబెద్కర్ బిల్డింగ్‌తోపాటు లైబ్రరీ ఏర్పాటు చేస్తామని వివరించారు. మాన్యువల్ స్కావెంజర్‌ను కఠినంగా నిషేధించి 2013 చట్టం అమలు చేస్తామని హామి ఇచ్చారు. అవినీతి బంధుప్రీతిలేని పారదర్శక ఇందిరమ్మ పాలన తీసుకొస్తామని తెలిపారు.అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలి పారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని విక్రమార్క తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని డిప్యూటీ సీఎం వివరించారు. మహాలక్షి ్మ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సిఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని డిప్యూటీ సిఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ పుదుచ్చేరి లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే ఖాయమని అన్నారు. కేంద్రంలో బిజెపి ఇక్కడి పాలకుల వైఫల్యాలను ప్రజలకు చూపాలనే లక్ష ్యంగా ప్రచార చేస్తున్నామని,ప్రజలంతా కాంగ్రెస్ కు అడంగా ఉన్నారని ఆయన ధీమాను వ్యక్తంచేశారు.

# ఫార్మాఉత్పత్తులపై 100 శాతం ట్రంప్ టారిఫ్

### మళ్లీ సుంకాల బాంబు పేల్చిన అమెరికా అధ్యక్షుడు



**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి ఫార్మా ఉత్పత్తులపై సుంకాల పిడుగు వేశారు. దేశీయ భద్రత, సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను కారణంగా చూపుతూ.. విదేశాల నుంచి దిగుమయ్యే కొన్ని పేటెంట్ ఔషధాలపై 100శాతం సుంకాలు విధించారు. అమెరికాలోనే ఎక్కువ ఉత్పత్తి చేసేలా ఔషధ తయారీదారులపై ఒత్తిడి తెచ్చేందుకు ట్రంప్ ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదించిన ఈ కొత్త సుంకం, అమెరికాతో సుంకాల ఒప్పందాలు లేని దేశాలలో, ప్రభుత్వంతో అత్యంత ప్రాధాన్య దేశ ధరల ఒప్పందాలు లేని కంపెనీలు తయారు చేసిన పేటెంట్ పొందిన ఔషధాలకు వర్తిస్తుంది. వైట్ హౌస్ ప్రకటన ప్రకారం, కొన్ని పెద్ద కంపెనీలు తయారు చేసిన ఉత్పత్తులపై సుంకాలు 120 రోజుల్లో అమల్లోకి వస్తాయి, అయితే చిన్న తయారీదారుల వస్తువులపై మరో 180 రోజుల వరకు ప్రభావం ఉండదు. వైట్ హౌస్‌తో ఒప్పందాలు కుదుర్చుకునే ప్రధాన ఆర్థిక వ్యవస్థల నుండి దిగుమతులపై సుంకాలు 15శాతం వద్ద పరిమితం చేయబడతాయి. ఇందులో యూరోపియన్ యూనియన్, దక్షి ణ కొరియా, జపాన్, స్విట్జర్లాండ్, లీచ్‌టెన్‌స్టైన్ ఉన్నాయని ఆ ప్రకటన తెలిపింది. అయితే, అమెరికా ప్రభుత్వంతో "మోస్ట్ ఫేవర్డ్ నేషన్"(ఎంఎఫ్‌ఎన్) ధరల ఒప్పందం కుదుర్చుకుని, అమెరికాలో తయారీ యూనిట్లను నిర్మిస్తున్న కంపెనీలకు సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ధరల ఒప్పందం చేసుకోకపోయినా, అమెరికాలో తయారీ ప్రాజెక్టులు చేపడుతున్న కంపెనీలకు 20శాతం సుంకం విధిస్తారు. నాలుగేళ్లలో ఈ సుంకం 100శాతానికి పెరుగుతుంది. ఒప్పందాలు చేసుకోని పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతర కంపెనీలకు 180 రోజుల గడువు ఇచ్చారు. ఈ లోపు ఒప్పందాలు చేసుకోకపోతే 100 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి. ఇప్పటికే 17 ప్రముఖ ఫార్మా కంపెనీలతో ధరల ఒప్పందాలు కుదిరినట్లు, వాటిలో 13 కంపెనీలు సంతకాలు చేసినట్లు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

ప్రస్తుతం అమెరికాలో పంపిణీ అవుతున్న పేటెంట్ ఔషధాల్లో దాదాపు 53 శాతం విదేశాల్లోనే తయారవుతున్నాయని, కేవలం 15శాతం యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఎపిఐ) మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

గురువారం కుదిరిన ఒక ప్రత్యేక ఒప్పందంలో భాగంగా, రాబోయే దశాబ్దంలో జీడిపిలో కొత్త ఔషధాలపై ప్రభుత్వ వ్యయాన్ని రెట్టింపు చేయడానికి అంగీకరించినందున, యుకె నుండి దిగుమతులపై తక్కువ రేటు వర్తిస్తుంది. అమెరికాలో కొంత తయారీకి కట్టుబడి ఉండే కంపెనీలు తయారుచేసే ఔషధాల దిగుమతి ఉత్పత్తులపై 20శాతం పన్ను విధించబడుతుంది, వారు ఎంఎఫ్‌ఎన్ ఒప్పందాలు కుదుర్చుకుంటే, ఆ రేటు సున్నాకి పడిపోతుందని వైట్ హౌస్ తెలిపింది.

# భారంగా భావించి.. బావిలో పడేసి..

>> పిల్లలను తనతో పాటు పొలానికి తీసుకువెళ్ళి కావాలనే వారిని బావిలో ముంచి చంపినట్లుగా కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. గీతాంశీ శవం పైకి తెలగ, గీతాన్విక మృతదేహం లభ్యం కాలేదు. శ్రీశైలం కదలికలపై అనుమానం వ్యక్తం చేసిన స్థానికులు అతడే హత్య చేశాడని నిర్ధారించుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పిల్లల మృతదేహాల కోసం గాలింపులు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు గాలింపులు చేయగా రెండో మృతదేహం కూడా లభ్యమయింది. సంఘటన స్థలాన్ని ఎసిపి విజయ కుమార్ సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలంలో పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిల్లల తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# పాతపేరుతో కొత్త అజెండా!

>> లేరన్న కవిత, తమ ప్రధాన పోరాటం కాంగ్రెస్ పైనే ఉంటుందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, పునర్విభజన అయినా, కాకపోయినా తమ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి గురించి తమకు అవసరం లేదని అన్నారు.తాను కేసు కొట్టి వేశారంటేనే ప్రకృతి తనకు సహకరిస్తుందని, తమ అజెండా ప్రకటించాక.. చాలా మంది పార్టీలోకి వస్తారని అన్నారు. ఆరు గ్యారెంటీల గురించి కేరళలో రేవంత్ రెడ్డి మాటలు విడ్డూరంగా ఉన్నాయని, మహారాష్ట్ర, బీహార్ లో కూడా ఇలాగే చెప్పారని..కాంగ్రెస్ ను ఓడించారని ఎద్దేవా చేశారు. ప్రైవేట్ పాఠశాలలు 25 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచాయని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖ సిఎం వద్దే ఉన్నా.. ఫీజుల విషయంలో, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నా రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని కవిత మండిపడ్డారు.

## ఐఎన్‌ఎస్ తారాగిరి జలప్రవేశం

>> లకు చిక్కకుండా అత్యంత రహస్యంగా పనిచేయడం దీని ప్రత్యేకత. గాలిలోని లక్ష్యాలు, ఉపరితలంతో పాటు సముద్రగర్భంలోని జలాంతర్గాములను ఏకకాలంలోనే ఇది ఎదుర్కోగలదు. గతేడాది నవంబరు 28న ఐఎన్‌ఎస్ తారాగిరిని నేవీకి అప్పగించారు.మొత్తం 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పు ఉండే ఈ యుద్ధ నౌక బరువు 6,670 టన్నులు. కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్‌తో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ఐఎన్‌ఎస్ తారాగిరి ప్రయాణించగలదు. దీనిలో స్టెల్త్ ఫ్రిగేట్‌తో కూడిన ఆధునిక సాంకేతికత ఉంది. బరాక్8 వంటి విమాన విధ్వంసక, బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షి పణులు ఇందులో ఉన్నాయి. యాంటీసబ్‌మెరైన్ వార్‌ఫేర్ వ్యవస్థ, శత్రువుల జాడ, ప్రమాదాన్ని ముందే గుర్తించే రాడార్ వ్యవస్థ ఇందులో ఉంది.ఇక, 1980 నుంచి 2013 వరకు నౌకదళానికి సేవలందించిన పాతతరం ఐఎస్‌ఎస్ తారాగిరి వారసత్వాన్ని ఇది కొనసాగించనుంది. స్టెల్త్, ఆటోమేషన్, అద్భుతమైన పోరాట శక్తి కలయికతో రూపుదిద్దుకున్న కొత్త తారాగిరి భారత రక్షణ ఉత్పాదక వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని షిప్ కమాండింగ్ ఆఫీసర్ హేమంత్ గోపాల్ తెలిపారు. హిందూ మహాసముద్రంలో చోటుచేసుకుంటోన్న భౌగోళిక పరిణామాల దృష్ట్యా ఐఎన్‌ఎస్ తారాగిరి నౌకాదళానికి కీలకంగా మారనుంది.

## భారత్‌కు నిరాఘాటంగా చమురు సరఫరాకు రష్యా హామీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో రష్యా ముందుకువచ్చింది. భారత్‌కు అవసరమైన ముడి చమురు, సహజ వాయువు సరఫరాను మరింత పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. రష్యా డిప్యూటీ ప్రధాన మంత్రి డెనిస్ మాంటురోవ్ గురువారం న్యూఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీ, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ , జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్‌తో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. ఇరాన్ యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి గుండా రవాణా నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. ఈ సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించేందుకు రష్యా కంపెనీలు నిరంతరం చమురు, గ్యాస్ సరఫరా చేస్తాయని మాంటురోవ్ హామీ ఇచ్చారు. 2026 జనవరిలో రష్యా నుంచి భారత్ దిగుమతులు 19.3 శాతానికి పడిపోయాయి. అయితే ఫిబ్రవరిలో అమెరికా ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత్ మళ్ళీ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను వేగంగా పెంచుతోంది. గత ఏడాది రష్యా భారత్‌కు ఎరువుల సరఫరాను 40 శాతం పెంచింది. భవిష్యత్తులో కూడా భారత రైతుల అవసరాలకు తగ్గట్టుగా ఎరువులను అందించడానికి రష్యా మొగ్గు చూపుతోంది. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ఏటా 100 బిలియన్ డాలర్ల వ్యాపారం జరగాలని ప్రధాని మోదీ, పుతిన్ గతంలోనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

అందులో భాగంగానే ఇప్పుడు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, అణుశక్తి రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. మొత్తంగా చెప్పాలంటే, పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా భారత్‌కు ఒక బలమైన భరోసాగా నిలిచింది.

## గ్రూప్-1పై దాఖలైన పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్3:** తెలంగాణ గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల మా ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపు గా భావిస్తున్నాను అని శుక్రవారం ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్ళ కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టం పై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్ల కాలం వెళ్లదీసిన గ్రూప్ 1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసి, ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ 1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశాం అని చెప్పారు. వారికి మరో సారి నా అభినందనలు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి,

నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు అని ప్రకటించారు. గ్రూప్–1 పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు: తెలంగాణ గ్రూప్–1 నియామకాలపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఉద్యోగాల నియా మకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఎంపిక ప్రక్రియ, మూల్యాంకనంలో తప్పులున్నాయని, ఈ నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టును కోరారు. నియామకాలు కొనసాగించవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిందని, అభ్యర్థుల వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు వెల్లడించిందని పిటిషన్‌లో అభ్యర్థులు పేర్కొన్నారు. వీరి వాదోపవాదనలు విన్న జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.

## వారం - వర్జ్యం

04-04-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
విదియ ఉ.10.10
స్వాతి రా.9.37
వర్జ్యం : రా.3.49–తె.5.35
దు.ఉ.6.00–ఉ.7.37
శుభసమయం: ఉ.7.45–8.30
రాహుకాలం - ఉ.9.00–10.30

## వార్తాఫలం

**మేషం :** నిర్మోహమాటంగా మాట్లాడి కొందరు వ్యక్తులను దూరంచేసుకుంటారు. స్థలాలు కొనుగోలులో తొందర వద్దు.

**వృషభం :** ధర్మం న్యాయం మొదలయిన ధార్మిక విషయాలకు ఇచ్చిన ప్రాధాన్యత వ్యక్తిగత విషయాలకు ఇవ్వరు.

**మిథునం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వస్త్రలాభం.

**కర్కాటకం:** సన్నిహితులను కలుసుకొని సంతోషంగా గడుపుతారు. కొత్త కార్య క్రమాలలో పాల్గొంటారు. ధనలాభం.

**సింహం:** విద్యార్థులు తమ ప్రతిభతో పేరు ప్రఖ్యాతులు పొందుతారు. కోర్టు వ్యవ హారాలు వాయిదాలలో ఉంటాయి.

**కన్య :** కీలక విషయాలలో తుదినిర్ణయాలు తీసుకుంటారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తాయి.

**తుల :** కుటుంబ సభ్యులను మంచి మాటలతో మరింత సన్నిహితం చేసు కుంటారు. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**వృశ్చికం:** ఎదుటివారికి సైతం సహాయ పడతారు.కనుమరుగైన వస్తువులు కనిపించ వచ్చు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**ధనుస్సు:** ఆత్మస్థైర్యంతో, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.వస్త్రలాభం.

**మకరం:** ముఖ్యులతో కలిసి వ్యూహాత్మక నిర్ణయాలు చేస్తారు. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**కుంభం:** ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ముఖ్యవ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం :** పెండింగ్‌లో వున్న కేసులలో విజయం సాధిస్తారు. పట్టుదల పెరుగు తోంది. గృహ నిర్మాణ యత్నాలు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేద్దాం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. బహుజన ఆత్మగౌరవ ప్రతీక దొడ్డి కొమురయ్య అన్న సీఎం, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య పోరాడారని గుర్తు చేశారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## సిఎం రేవంత్‌రెడ్డితో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 3:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో శుక్రవారం నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైరీ ఢిల్లీ చైర్మన్ జయతీర్థా చారి మర్యాదపూర్వకం గా కలిశారు.రాష్ట్రంలో పాడి పరిశ్రామిభివృద్ధి పైన చర్చ చేశారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర డెయిరీ డెవలప్ మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



## గవర్నర్‌తో ఎంపి డికె అరుణ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 3:** మహబూబ్‌నగర్ ఎంపీ డి.కే. అరుణ శుక్రవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను కలిశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై గవర్నర్ తో ఆమె చర్చించారు.

# ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ అసత్య ప్రచారం

### మోసగిస్తూ పబ్బం గడుపుతున్నారు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** కేరళంలో ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం పూర్తిగా అసత్య ప్రచారం దారుణంగా ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణ లో పూర్తిగా విఫలమయ్యారని, ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇది సాధారణ అబద్ధం కాదు, ప్రజలను మోసం చేసే ప్రయత్నం అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా? పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు 3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా? దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పారు, ఇచ్చారా? బిసిలకు లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు..రెండు సంవత్సరాల్లో ఒక్క ఏడాది కూడా రూ.20,000 కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం ఒక మోసం అయితే, అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్ధాలు చెప్పడం ప్రజలతో దగా చేయడమే.తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ? ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ? నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఎక్కడ? ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి? అయినా కూడా గ్యారెంటీలు అమలు చేశాం అని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మవద్దని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కెసిఆర్ కుటుంబంపై కేసులు పెడతామని, జైలుకు పంపుతామని, లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఒక్క కేసులో కూడా చర్యలు తీసుకోలేదు.మరి ఆ ఆరోపణలు ఏమయ్యాయి? దర్యాప్తు ఎక్కడికి పోయింది? ఇప్పుడు తమ అసమర్థతను దాచుకోవడానికి బిజెపిపై నెపం వేస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీగా బాధ్యత కాంగ్రెస్‌దే. వేరే వాళ్లపై నెట్టడం కాదు, తెలంగాణ ప్రజలకు హామీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అమలు చేయాల్సిన ప్రజాస్వామ్య బాధ్యత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు.



# హార్ముజ్‌లో నావికుల్ని కోల్పోయిన ఏకైక దేశం మాదే!

### 40 దేశాల ప్రతినిధుల వర్చువల్ భేటీలో

### విదేశాంగ కార్యదర్శి ఆందోళన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధం రెండో నెలకు చేరుకుంది. ఈ యుద్ధంలో ముందుగా ఇరాన్ నాయకత్వాన్ని తుడిచిపెడితే చాలని భావించిన ప్రత్యర్థులకు హార్ముజ్ జలసంధిని మూసేసి ఎదురు ఒత్తిడి పెట్టే స్థితికి ఆ దేశం చేరుకుంది. దీంతో ఇప్పుడు హార్ముజ్ జలసంధిని తెరిపించేందుకు అంతర్జాతీయంగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో బ్రిటన్, భారత్‌తోపాటు మొత్తం 35 దేశాలు ఏకతాటిపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 35 దేశాల ప్రతినిధులు వర్చువల్ గా భేటీ అయి హార్ముజ్ జలసంధిని తెరిపించే మార్గాలపై చర్చించారు. ఈ భేటీలో హార్ముజ్ జలసంధి మూసివేత నేపథ్యంలో తమకు ఎదురవుతున్న కష్టాల్ని పలు దేశాలు ఏకరువు పెట్టాయి. ఇందులో భారత్ కూడా ఉంది. మన దేశం తరఫున ఈ భేటీకి వర్చువల్‌గా హాజరైన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ హార్ముజ్ జలసంధిలో నావికుల్ని కోల్పోయిన ఏకైక దేశం తమదేనని ఆందోళన వ్యక్తంచేసారు. హార్ముజ్ జలసంధి ద్వారా రాకపోకలను పునరుద్ధరించడం, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలను పరిష్కరించడంపై జరిగిన ఈ భేటీలో మిస్రీ ఈ ప్రకటన చేశారు. బ్రిటన్ నిర్వహించిన ఈ అంతర్జాతీయ వేదికపై 60కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ వర్చువల్ సమావేశంలో సముద్రంలో స్వేచ్ఛా నౌకాయానాన్ని కొనసాగించడం, ప్రపంచ సముద్ర మార్గాల ద్వారా నిరంతరాయ రాకపోకలను నిర్ధారించడం యొక్క ఆవశ్యకతపై చర్చించారు. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఘర్షణలపై భారత్ తన వైఖరిని కుండబద్దలు కొట్టింది. ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులకు తిరిగి రావడం ద్వారానే పరిస్థితిని పరిష్కరించగలమని మిస్రీ సూచించారు. ఈ సంఘర్షణ భారతదేశ ఇంధన అవసరాలపై తీవ్ర భారం మోపిందని, గల్ఫ్‌లో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో కేవలం భారతీయ నావికులు మాత్రమే మరణించారని మిస్రీ పేర్కొన్నారు.



## ఆంధ్ర నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్ల పట్టివేత

### 100 టన్నుల ఇసుక స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఎనిమిది మందిని వరంగల్ యూనిట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసులు పెట్టారు. నిందితులు దొడ్డ శ్రీనివాసరావు,దొడ్డ ప్రవీణ్‌లు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి అక్రమంగా రవాణ చేస్తున్నారనీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ పిఆర్‌వో వెంకటేశ్వర్లు ఒక పత్రికా ప్రకనటలో తెలిపారు. అక్రమ రవాణాపై సమాచారం అండటంతో వరంగల్ యూనిట్ విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపూర్ శివారులో తనిఖీలు చేపట్టారు. మూడు టిప్పర్లలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖమ్మం జిల్లా బేతుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్లు ఈ అక్రమరవాణాకు ఉపయోగిస్తున్నట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తెలిసింది.

# మహిళల ఉన్నత విద్యలో తెలంగాణ టాప్

### ఐలమ్మ వర్సిటీ నం.1

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** దేశంలోని మహిళా ఉన్నతవిద్య రంగంలో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రకటించిన హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2026-27లో వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం దేశంలో అన్ని మహిళా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ప్రథమ స్థానం సాధించింది. ఈ విశ్వవిద్యాలయం మొత్తం 870 మార్కులతో దేశవ్యాప్తంగా అగ్రస్థానాన్ని దక్కించుకొని ప్రముఖ విశ్వవిద్యాలయాలను వెనక్కి నెట్టింది. వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం 870 మార్కులతో మొదటి స్థానం దక్కించుకోగా.. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 861 మార్కులతో రెండోస్థానంలో, కొడైకెనాల్‌లోని మదర్ థెరిసా మహిళా విశ్వవిద్యాలయం 838 మార్కులతో మూడవ స్థానంలో ఉండగా.. జంషెడ్‌పూర్ మహిళా విశ్వవిద్యాలయం 757 మార్కులతో 4వ స్థానంలో నిలిచింది. పరిశోధన. ఆవిష్కరణలకి 138 మార్కులు రాగా, అధ్యాపకుల నైపుణ్యానికి 131 మార్కులు, మౌలిక వసతులకి 127 మార్కులు, అధ్యాపక సంక్షేమానికి 75 మార్కులు, పాఠ్యప్రణాళిక, బోధనకి 69 మార్కులను కేటాయించగా, ప్లేస్ మెంట్స్‌కి 65 మార్కులు, ఇండస్ట్రీ ఇంటర్‌ఫేస్‌కి 64 మార్కులు, అంతర్జాతీయత అండ్ నాయకత్వంలో 66 మార్కులు వచ్చాయి. ఈ ఫలితాలు విశ్వవిద్యాలయం అకాడమిక్ నాణ్యత, పరిశోధన, మౌలిక వసతులు, విద్యార్థుల అభివృద్ధిలో సాధించిన సమగ్ర పురోగతిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ ఘనత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం కాగా, మహిళా విద్య అభివృద్ధిలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తున్నదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# మాసాయిపేట సర్పంచ్ దుర్గం లహరిక ఆత్మహత్య

**ఖానాపూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక (29) శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. లహరిక గుర్తు తెలియని పురుగుల మందు సేవించడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో చికిత్స నిమిత్తం కారులో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో, వెంటనే ఆమెను మరో వాహనంలో ఆసుపత్రికి తరలిం చారు. పరీక్షి ంచిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కేవలం మూడు నెలల క్రితమే మాసాయిపేట సర్పంచ్‌గా లహరిక భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కడెం ఎస్సై పి. సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సర్పంచ్ లహరిక మృతి పట్ల కడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్త, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



దుర్గం లహరిక (ఫైల్)

# పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సిఎండిగా రామ్మోహన్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మహారత్న సంస్థ అయిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు సీఎండీగా బుర్రా వంశీ రామ్మోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో డైరెక్టర్ (ప్రాజెక్టులు)గా పనిచేశారు. విద్యుత్ ప్రసారం, టెలికాం రంగాలలో 33 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న రామ్మోహన్ తన పదవీ విరమణ తేదీ అయిన జూలై 31, 2030 వరకు, లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సీఎండీగా కొనసాగుతారు. కాగా వంశీ హైదరాబాద్‌లో పుట్టి పెరిగడంతో పాటు, తన ప్రాథమిక విద్యను ఇక్కడే అభ్యసించారు. తదుపరి అనంతపూర్‌లోని శ్రీకృష్ణదేవ రాయల విశ్వవిద్యాలయం నుండి బీటెక్ పూర్తి చేసి, హార్వర్డ్ మేనేజ్ మెంటర్ ప్రోగ్రామ్, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో అధునాతన నిర్వహణ కోర్సులను పూర్తి చేశారు. పవర్‌గ్రిడ్ రెగ్యులేటరీ సెల్‌లో ఆయన వ్యవస్థాపక సభ్యుడని, విద్యుత్ ప్రసార మార్కెట్‌లో పోటీ బిడ్డింగ్‌లోకి పవర్‌గ్రిడ్ ప్రవేశించడంలో కీలక పాత్ర పోషించారు.. పవర్ గ్రిడ్ టెలిసర్వీసెస్ లిమిటెడ్ సీఈఓగా, ఆయన టెలికాం వ్యాపార విస్తరణకు నాయకత్వం వహించి, సంస్థ యొక్క డిజిటల్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిన కంపెనీ మొదటి డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు.

# హైదరాబాద్‌లో మరో గోల్డ్‌మ్యాన్‌పై ఐటి దాడులు

### ఒంటిపై నుంచి కోటి విలువైన బంగారు నగల జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గోల్డ్‌మ్యాన్‌లపై ఐటి అధికారుల దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఒంటిపై భారీగా నగలను ధరిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ గుళ్లు, గోపురాలు తిరుగుతున్న వ్యక్తులపై ఐటి అధికారులు వరుసగా దాడులు చేస్తూ వారి వద్ద లెక్కలోలేని నగలను జప్తు చేస్తున్నారు. వారం రోజుల క్రితం శేరిలింగంపల్లిలో విజయ్‌కుమార్ అనే వ్యక్తి భారీగా బంగారు నగలు ధరించి తిరుపతి సహా పలు నగరాలల్లో విమా నాల్లో తిరగగా ఢిల్లీలో ఐటి అధికారులు పట్టుకుని అతని ఒంటిపై వున్న నగలను జప్తు చేయడం తెలిసిందే. చివరకు ఇవన్నీ రోల్ట్ గోల్డ్‌గా తేలడం సంచలనం రేపింది. ఇతనిపై కేసు నమోదు చేశారు. ఇక తాజా విషయానికి వస్తే మాదా పూర్‌కు చెందిన యాదగిరి చిన్నగౌడ్ అలియాస్ దర్గా చిన్నా పహిల్వాన్ అనే వ్యక్తి ఒంటిపై భారీగా నగలు ధరించి పలు ఛానల్స్‌లో ఇంటర్వ్యూలు ఇవ్వడం, యూట్యూబ్ ఛా నళ్లలో మాట్లాడడంతో శుక్రవారంనాడు ఐటి అధికారులు అతని ఇంటిపై దాడిచేశారు. ఈ సందర్భంగా అతని ఒంటిపై 900 గ్రాముల బంగారు నగలు ఉండగా అందులో 700 గ్రాములకు లెక్కలు లేకపోవడంతో వాటిని ఐటి అధికారులు జప్తు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమల్లో వచ్చిన కొత్త ఆదాయపపు పన్ను చట్టం 2025లోని సెక్షన్ 247 కింద దర్గా చిన్నా పహిల్వాన్‌పై కేసు నమోదు చేశారు గతంలో ఇలాంటి కేసులను సెక్షన్ 132 కింద విచారించే వారు. దాడుల తరువాత దర్గా చిన్నా పహిల్వాన్‌కు 200 గ్రాముల నగలను ఐటి అధికారులు తిరిగి ఇచ్చేశారు.

దేశంలో ఐటి కొత్త చట్టం కింద కేసు నమో దైన మొదటి వ్యక్తి దర్గా చిన్నా పహిల్వాన్ కావడం గమనార్హం. కాగా ఈ దాడులపై ఐటి అధికారులు మీడియాతో మాట్లాడుతూ యూ ట్యూబ్‌లతోపాటు టివి ఛానళ్లలో వచ్చిన ఇంట ర్వ్యూలు, సోషల్ మీడి యాలో వచ్చిన ప్రచారం నేపథ్యంలో విచారణ చేసి లెక్కలో లేని నగలను జప్తు చేసినట్లు తెలిపారు. విచారణలో తన వద్ద లెక్కలోలేని బంగారం వుందని దర్గా చిన్నా పహిల్వాన్ అంగీకరించినట్లు ఐటి అధికారులు తెలిపారు. దర్గా చిన్నా పహిల్వాన్ దాఖలు చేసిన ఒకే ఐటి రిటర్న్‌లో కేవలం నాలుగు లక్షల రూపాయల ఆదాయం మాత్రమే చూపినట్లు వారు తెలిపారు. జనరల్ పవర్ ఆఫ్ అటర్నీపై భూములు కొని వాటిని ఎక్కువ ధరలకు అమ్మి మధ్యలో తేడా మొత్తాన్ని నగదుగా మార్చుకుని, లబ్ధి పొందడం వల్ల దర్గా చిన్నా పహిల్వాన్ నగలను కొన్నట్లు ఐటి అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ జరుగుతోంది. ఈ ఉదంతంలో దర్గా చిన్నా పహిల్వాన్ కుటుంబ సభ్యుల ఆదాయంపైనా విచారణ సాగుతోంది.



ఐటి అధికారులకు పట్టుబడిన గోల్డ్‌మ్యాన్ దర్గా చిన్నా పహిల్వాన్


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on: @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**నెం.డిప్యూటీ. సిఇఇ-జిఎస్-బిజెడ్ఎ-39-2025-26 తేది: 01.04.2026** PUB/012

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు టెండరింగ్ యొక్క ఓపెన్ టెండరు/సింగిల్ ప్యాకెట్ సిస్టంలో దిగువ పనుల కొరకు ఇ-టెండరు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు నెం.: బిజడ్ఎ-జిఎస్‌యు-ఇఎల్ఇసి-39-2025-26, తేది: 16.03.2026. పని వివరణ: బిజడ్ఎ డివిజన్- బిట్రగుంట (బిటిటిఆర్) వద్ద సిసి రేక్ నిర్వహణ కొరకు ఫ్రైట్‌టెయిన్ ఎగ్జామినేషన్ సౌకర్యముల యొక్క అభివృద్ధికి విద్యుత్ సరఫరా అరేంజ్‌మెంట్ల ఏర్పాటు చేయుట. టెండరు విలువ (రూ): 70,86,461.33. బయానా (రూ): 1,41,700.00. పూర్తి చేయు కాలం: 09 నెలలు. టెండరు ఫారం ధర(రూ): లేదు. ముగింపు తేది మరియు సమయం: 13.04.2026న 15.00గం.లు.

1. బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.inనకు లాగిన్ అవ్వండి.
2. బయానా సొమ్ము ధరావతును ఐఆర్ఇపిఎస్‌లో ఆన్‌లైన్‌లో లభించు నెట్ బ్యాంకింగ్/పేమెంట్ గేట్‌వే సౌకర్యముల ద్వారా మాత్రమే చెల్లింపు చేయవలెను (లేదా) బిడ్ సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ గ్యారంటీని ఎఫ్ఎ & సిఎఓ/Con/ఎస్.సి. రైల్వే, సికింద్రాబాద్ వారి పేర స్వయంగా సమర్పించవలెను.
3. టెండరుదారులు టెండరు ముగింపుకు ముందు 15 రోజుల కాల వ్యవధిగా ఉండే టెండరు సమర్పణ/బిడ్డింగ్ వ్యవధిలో వారి ఆఫర్లు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చును.
4. ఏదేని సవరణ (ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడును) చూచుటకు టెండరుదారులు టెండరు సమర్పణ/బిడ్డింగ్ కాల వ్యవధి ప్రారంభ తేది వరకు గమనించవలెను.

చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతిశక్తి, విజయవాడ.

**టెండరు ప్రకటన నెం. ఎల్‌జిడి/ఎల్/01/2026-27 /ఓటి తేది: 02.04.2026** PUB/014

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న డిప్యూటీ సిఇఇ/ఎల్‌జిడిఎస్ వారు టెండరు నెం. ఎల్‌జిడి/ఎల్/01/2026-27/ ఓటి-ఇ-టెండరు పై ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేది: 30.04.2026న 05.00గం.లకు. బిడ్డర్లు ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే వారి అసలు/సవరించిన బిడ్లను సమర్పించగలరు. ఈ టెండరులో మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏవేని అటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించినా విస్మరించబడును.

కాంట్రాక్టర్లు బయానా సొమ్ము (బిడ్ సెక్యూరిటీ) కొరకు ఈ టెండరులో చెల్లింపులు చేయుటకు ఇ-చెల్లింపు గేట్‌వే ద్వారా నగదు రూపంలో కాని లేదా భారతదేశం యొక్క షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంక్ నుండి బ్యాంకు గ్యారంటీ బాండ్‌గా సమర్పించుట లేదా టెండరు డాక్యుమెంట్లలో పేర్కొన్న విధంగా చేయుటకు అనుమతించబడతారు.

బ్యాంకు గ్యారంటీ బాండ్ అనుబంధం-VI ఎ ప్రకారం ఉండాలి మరియు బిడ్ చెల్లుబాటు కాల వ్యవధి తరువాత 60 రోజుల కాల వ్యవధి కొరకు చెల్లుబాటవ్వాలి. ఒరిజినల్ బ్యాంక్ గ్యారంటీ బిడ్లు సమర్పించుటకు గడువు తేది యొక్క 5 పనిరోజులలోపు టెండరు డాక్యుమెంట్‌లో సూచించిన విధంగా ఎంపిక చేయబడిన అధికారికి స్వయంగా అందజేయవలెను. ఇ-టెండరింగ్ పోర్టల్ (ఐఆర్ఇపిఎస్)లో బిడ్‌తోపాటు బి.జి యొక్క స్కాన్ చేసిన ప్రతి సమర్పించకపోవుట మరియు/లేదా నిర్దేశిత కాల వ్యవధిలోపు ఒరిజినల్ బిజి సమర్పించని కారణంగా బిడ్ పూర్తిగా తిరస్కరించబడును.

క్ర.సం.1. టెండరు నెం.: ఎల్‌జిడి/ఎల్/01/2026-27/ఓటి పని వివరణ: పవర్ కారులలో స్టార్టింగ్ బ్యాటరీ కొరకు ఐసోలేషన్ స్విచ్ యొక్క పునఃస్థాపన. సుమారు విలువ (రూ): 1,63,34,350.69 (ఒక కోటి అరవై మూడు లక్షల ముప్పై నాలుగు వేల మూడు వందల యాభై రూపాయలు మరియు అరవై తొమ్మిది పైసలు మాత్రమే). బిడ్ సెక్యూరిటీ (రూ): 3,26,700.00. పూర్తి చేయు కాలం: అంగీకారపత్రం జారీ తేదీ నుండి 24 నెలలు. ముగింపు తేది: 30.04.2026న 15.00గం.లు.

వెబ్‌సైట్ వివరాలు www.ireps.gov.in

టెండరు యొక్క పూర్తి వివరాల కొరకు చూడదగిన నోటీసు బోర్డు ప్రదేశం : డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017 వారి కార్యాలయం.

తదుపరి టెండరు షరతులు/వివరాలు (టెండరు డాక్యుమెంట్లలో లభించును) మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ సవరణ కొరకు మా వెబ్‌సైట్ http://www.ireps.gov.in ను దర్శించగలరు.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ/ సికింద్రాబాద్

**టెండరు ప్రకటన నెం. ఇఎల్ఎస్-కెజడ్‌జె -218, తేది: 01.04.2026** PUB/015

దిగువ సంతకందారుచే దిగువ పనుల కొరకు అనుభవం గల కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

క్ర.సం.1. టెండరు నెం. & తేది : ఇఎల్ఎస్-కెజడ్‌జె-218 తేది: 01.04.2026. పని వివరణ: ఇఎల్ఎస్/కెజడ్‌జె వద్ద 2 సంవత్సరాల కాలవ్యవధి కొరకు మెసర్స్ హెచ్‌బైటి తయారీ యొక్క అండర్ ఫ్లోర్ పిట్ వీల్ లేత్ (ఎస్‌జియుఎఫ్-16) యొక్క నాన్ కాంప్రహెన్సివ్ వార్షిక నిర్వహణ కాంట్రాక్టు. టెండరు విలువ (రూ): 46,76,539.27. బయానా (బిడ్ సెక్యూరిటీ): రూ.93,500.00. టెండరు ఫారం ధర (రూ): లేదు. పూర్తి చేయు కాలం : 24 నెలలు. ముగింపు & తెరచు తేది మరియు సమయం: 22.04.2026న 15.00గం.లు. & 22-04-2026న 15.30గం.లు.

1. టెండరు షరతులు/ఇతర వివరాలు www.ireps.gov.in వద్ద ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్ యొక్క టెండరు డాక్యుమెంట్‌లో లభిస్తాయి.
2. భావి టెండరుదారులు అందరు ఇఎండి (బిడ్ సెక్యూరిటీ)ని ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే సమర్పించవలెను. www.ireps.gov.in వద్ద ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్ ద్వారా టెండరు డాక్యుమెంట్ యొక్క సమర్పణ.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఇఎల్ఎస్, కాజీపేట.

**టెండరు ప్రకటన నెం. 01/2026 తేది: 02.04.2026** PUB/016

స్టోర్స్ ఐటంల సరఫరా ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

దిగువ తెలిపిన టెండర్లు ఆన్‌లైన్ ద్వారా ప్రకటించబడినవి. టెండరుదారులు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించి మరియు వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవలసినదిగా కోరడమైనది. టెండరు వివరణ, పరిమాణం, ఇఎండి, ఎస్‌డిలను వెబ్‌సైట్‌లో చూడగలరు. స్వయంగా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్టు ద్వారా పంపిన ఆఫర్లు అనుమతించబడవు. టెండరు గడువు తేదీన టెండరు ముగింపు సమయం 14.30గం.లు. "అన్ని దేశీయ ప్రతిపాదనల కొరకు ఇఎండి www.ireps.gov.in లో అందుబాటులోగల ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అంగీకరించబడును".

| టెండరు నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 6026PT017 | ఆర్ 260 వెల్డింగ్ పోర్షన్ యొక్క సేకరణ |
| LW265018 | లైట్ వెయిట్ ట్రాక్ మెజరింగ్ ట్రాలీ (ఎల్‌డబ్ల్యుటిఎంటి) ఆర్‌డిఎస్ఓ. నెం. టిఎం/ఎస్ ఎం/ఎఫ్ఆర్ఎస్/013 |
| 29265004 | థర్మల్ యొక్క సరఫరా మరియు స్థాపన |
| 56265137 | 6 క్వాడ్ కేబుల్ 1.4మిమీ డయా కాపర్ కండక్టర్ |
| 60265228 | వివిధ రకాల స్క్రెవర్ బార్స్ యొక్క సేకరణ |
| 6026PT015 | హెచ్‌విఎన్ లైనర్ ఆర్‌డిఎస్ఓ. డిఆర్‌జి నెం. టి-3706 & ఆర్‌డిఎస్ఓ. డిఆర్‌జి నెం. టి-8751 యొక్క సేకరణ |
| 43265001 | సిఎంఎస్ కియోస్క్‌లు కాన్‌సిట్స్ యొక్క సరఫరా, స్థాపన & పనిచేయించుట |
| LT255299A | ఎంఎఫ్ కంట్రోల్ ప్యానల్‌తో డీజిల్ జనరేటర్ 500 కెవిఎ యొక్క సరఫరా స్థాపన & పనిచేయించుట |

గమనిక: టెండరు తెరచుట కొరకు గడువు తేదీలు క్ర.సం.01 తేది: 21.04.2026. క్ర.సం.02 తేది: 22.04.2026. క్ర.సం.03 తేది: 27.04.2026. క్ర.సం.04 తేది: 01.05.2026. క్ర.సం.05 & 6 తేది: 04.05.2026. క్ర.సం.07 తేది: 06.05.2026. క్ర.సం.08 తేది: 08.05.2026.

పైన పేర్కొన్న టెండర్లే కాక రూ.50 లక్షల కన్నా పైగా విలువగల ఇతర టెండర్లు కూడా కలవు. వివరాల కొరకు పై రైల్వే వెబ్‌సైట్ దర్శించగలరు.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/సికింద్రాబాద్

A013

తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.



**IN THE HON'BLE COMMERCIAL APPELLATE COURT, CHIRANG AT KAJALGAON**

**DATE FIXED: 06-04-2026**

**NOTICE TO SHOW CAUSE**

**Misc.(J) Case No. 06/2026**

[Arising out of Misc. Appeal No .......... ./2026]
[In connection with Misc. Arbitration No. 02/2020]

**Petitioner-Appellant:-** Indian Oil Corporation Limited, [Bongaigaon Refinery]

-Vs-

**Opp. Party-Respondent:-** M/S ECI Engineering & Construction Co. Ltd.

To,

1. M/S ECI Engineering & Construction Company Limited, Having its Registered Office at Plot No. A-12 & 13, Panchavati Township, Manikonda, Rajendranagar, Mandal (R.R. Dist.), Hyderabad, Telangana, PIN-500089.
2. M/S ECI Engineering & Construction Company Limited, Having its Registered Office at Plot No. 70, 3rd Floor, Anshu Colors, Road No. 1, Jubilee Hills, Hyderabad, Telangana, PIN-500033.

**Whereas,** the Petitioner-Appellant has filed an Appeal against the Judgment and Order dtd. 04.06.2025 passed by Ms. Syeda Sabina Afzal Zinnat, Ld. Judge, Commercial Court-cum-Civil Judge (Sr. Divn.), Chirang at Kajalgaon in Misc. Arbitration No. 02/2020 along with a Petition under Order 41 Rule 3-A read with Sec. 5 of the Limitation Act and also read with Sec. 151 of CPC for condonation of delay in filing the appeal.

You, the Opp. Party-Respondent, are hereby directed to appear before this Court either in person and/or through your appointed Advocate/Pleader on **06th day of April, 2026 at 10 O'clock in the forenoon** and to submit your written objection, if any, showing cause as to why the Petition for condonation of delay in filing the appeal shall not be allowed.

Take notice that if no appearance is made on your behalf by yourself/Your Pleader/Advocate and submit your written objection, if any, on the day and time before mentioned, the matter shall be heard ex-parte and be decided in your absence.

**Given under my HAND & the SEAL of the Court, this 17th day of March, 2026.**

Judge, Commercial Appellate
Court-cum-District Judge, Chirang

*By Order*
**Chief Administrative Officer**
District & Sessions Judge's Office
Chirang, Kajalgaon



**IN THE HON'BLE COMMERCIAL APPELLATE COURT, CHIRANG AT KAJALGAON**

**DATE FIXED: 06-04-2026**

**NOTICE TO SHOW CAUSE**

**Misc.(J) Case No. 05/2026**

[Arising out of Misc. Appeal No .......... ./2026]
[In connection with Misc. Arbitration No. 01/2020]

**Petitioner-Appellant:-** Indian Oil Corporation Limited, [Bongaigaon Refinery]

-Vs-

**Opp. Party-Respondent:-** M/S ECI Engineering & Construction Co. Ltd.

To,

1. M/S ECI Engineering & Construction Company Limited, Having its Registered Office at Plot No. A-12 & 13, Panchavati Township, Manikonda, Rajendranagar, Mandal (R.R. Dist.), Hyderabad, Telangana, PIN-500089.
2. M/S ECI Engineering & Construction Company Limited, Having its Registered Office at Plot No. 70, 3rd Floor, Anshu Colors, Road No. 1, Jubilee Hills, Hyderabad, Telangana, PIN-500033.

**Whereas,** the Petitioner-Appellant has filed an Appeal against the Judgment and Order dtd. 04.06.2025 (finally pronounced on 02.07.2025 on being rectified and corrected) passed by Ms. Syeda Sabina Afzal Zinnat, Ld. Judge, Commercial Court-cum-Civil Judge (Sr. Divn.), Chirang at Kajalgaon in Misc. Arbitration No. 01/2020 along with a Petition under Order 41 Rule 3-A read with Sec. 5 of the Limitation Act and also read with Sec. 151 of CPC for condonation of delay in filing the appeal.

You, the Opp. Party-Respondent, are hereby directed to appear before this Court either in person and/or through your appointed Advocate/Pleader on **06th day of April, 2026 at 10 O'clock in the forenoon** and to submit your written objection, if any, showing cause as to why the Petition for condonation of delay in filing the appeal shall not be allowed.

Take notice that if no appearance is made on your behalf by yourself/Your Pleader/Advocate and submit your written objection, if any, on the day and time before mentioned, the matter shall be heard ex-parte and be decided in your absence.

**Given under my HAND & the SEAL of the Court, this 17th day of March, 2026.**

Judge, Commercial Appellate
Court-cum-District Judge, Chirang

*By Order*
**Chief Administrative Officer**
District & Sessions Judge's Office
Chirang, Kajalgaon

వార్త

ఆత్మశుద్ధి లేనిదే ప్రతి జీవితోనూ సమైక్యత అన్నది ఏర్పడదు. ఆత్మశుద్ధి లేనిదే అహింస, ధర్మపాలన సాధ్యపడదు.

- మహాత్మా గాంధీ

# 'మమతా'వేశం!

ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుంది. సమస్యపై పోరాడేందుకూ ఓ పద్ధతి ఉంటుంది. అదీ ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రశ్నించడం మర్యాద, సంస్కారవంతం. కానీ కండబలంతో ఎవరినోరైనా నొక్కగలమనుకుంటే అది ఆరాచకానికి దారి తీస్తుంది. ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకునే ఏ ప్రభుత్వమైనా నియమబద్ధంగానే పాటించాలి. తప్ప అరాచకంతో అయోమయం సృష్టించాలంటే అది సాధ్యంకాదు. ఎలాగైనా బయటకొచ్చేస్తుంది. గత కొన్నాళ్లుగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న 'ప్రశ్నించడాలూ, నిరసనవ్యక్తం చేయడాలూ' అనే సందర్భంలో అరాచకం రాజ్యమేలుతోందన్న అభిప్రాయం న్యాయపాలికలో వ్యక్తమైంది. పశ్చిమ బెంగాల్ మమతాబెనర్జీ ఐదేళ్ల పరిపాలనత్వరలో పూర్తవుతుంది. ఇప్పటికే మూడుసార్లుగా బెంగాల్ రాజ్యమేలిన మమతా బెనర్జీ మరోసారి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారు. ఇంతవరకు అభ్యంతరమేమీ లేదు. కానీ ఏకంగా న్యాయవ్యవస్థ కనుసన్నల్లో సుప్రీం ధర్మాసనం పర్యవేక్షణలో జరుగుతున్న ఓటరు జాబితాల సవరణ కార్యక్రమాన్ని నవ్వులపాలు చేయాలని కంకణం కట్టుకున్నా పశ్చిమ బెంగాల్ రాజకీయ పార్టీ కార్యకర్తలు వ్యవహారం బాగా దూకుడుగా తయారైంది. ఆ రాష్ట్రంలో 'సర్' ప్రక్రియం ముమ్మరంగా సాగుతోంది. కాగా ఈ ప్రక్రియలో దాదాపు 80వేల మంది ఓటర్లను అన్యాయంగా తొలగించారంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చాలా కాలంగా ఎన్నికల కమిషన్‌పై విరుచుకపడుతున్నారు. పరోక్షంగా ఎన్నికల కమిషన్ ప్రతి కార్యక్రమాన్ని ఆమె తప్పుపడుతున్నారు. వారు తలపెట్టిన ఏ కార్యక్రమమైనా ప్రజాయోగ్యంకాదని వాదిస్తున్నారు. దాంతో సుప్రీంకోర్టు ధర్మాసనం జోక్యం చేసుకుని ఎన్నికల కమిషన్‌కు కొన్ని మార్గదర్శక సూత్రాలను అందించింది. 'సర్' కార్యక్రమాన్ని సజావుగా నడిపించేందుకు జ్యుడీషియల్ అధికార్లను పర్యవేక్షకులుగా నియమించి ఓటర్ల అభ్యంతరాలను సరి చేయించే ప్రయత్నంలో ఉన్నారు. తాజాగా పశ్చిమ బెంగాల్ 'మాల్డా' కాలియ చౌక్ జిల్లాలోకొందరు కార్యకర్తలు 'సర్' విధుల్లో ఉన్న ముగ్గురు మహిళలతో సహా ఏడుగురు అధికారుల్ని నిర్బంధించారు. ఆపై వారి వాహనాల మీద రాళ్లు కర్రలతో దాడిచేశారు. ఈ విషయం తెలిసి అధికారులపై దాడిని సుప్రీం ధర్మాసనం ఖండించింది. పశ్చిమ బెంగాల్ పాలనా యంత్రాంగం నిష్క్రియాపరత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అదొక నేరపూరిత వైఫల్యంగా పేర్కొని మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. 'సర్' ప్రక్రియకు అడ్డంకులు కలుగ కుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. జరిగిన ఉదంతంపై సిబిఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలంటూ ఇసికి సూచించింది. కేవలం కొందరు ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి ఓట్లను తొలగించడమే 'సర్' కార్యక్రమంగా ఉంటోందని మమతా బెనర్జీ ఆది నుంచి ఇసిపై ఆరోపణలు చేస్తోంది. ఇలాంటి సందర్భంలో ఇసికి, మమతా బెనర్జీకి మధ్య పొత్తు పొసగడం లేదు. సాయంత్రం 3.30కి మొదలైన దుస్సంఘటన అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. నిర్బంధంలో ఉన్న జుడీషియల్ అధికారుల్ని రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని ధర్మాసనం బెంగాల్‌ప్రభుత్వాన్ని నిందించింది. ఈఅంశంపై బెంగాల్ ప్రజల్లో వ్యతిరేకతలు చోటు చేసుకున్నాయి. అధికారుల్లో మనోధైర్యం దెబ్బ తీసేందుకు ముందస్తు ఆలోచనతోనే కుట్ర జరిగిందని ధర్మాసనం వ్యాఖ్యలుచేసింది. సంఘటన ఉదంతం తెలియగానే సుప్రీంధర్మాసనం ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ ఘటనను సుమోటోగా స్వీకరించారు. చట్టాలను చేతుల్లోకి తీసుకోవాలనుకోవడాన్ని కోర్టు క్షమించదని హెచ్చరించారు. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాష మాట్లాడుతున్నారని ఆవేశకావేశాలకు లోనుకావడం సరికాదని కోర్టు మందలించింది. రాజకీయ ప్రేరేపిత చర్య కాదని అనుకునేందుకు వీలుగా లేదని అన్నారు. కోల్‌కత్తా ప్రధాన న్యాయమూర్తి రంగంలోకి దిగి డిజిపి, హోంశాఖ కార్యదర్శితో మాట్లాడితే తప్ప ప్రభుత్వపరమైన సహాయం లభించలేదని జస్టిస్ సూర్యకాంత్ వివరిస్తున్నారు. దాదాపు 9 గంటల పాటు న్యాయాధికారుల నిర్బంధం జరిగిందంటే మనం ఎక్కడ ఉన్నామని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థను భయభ్రాంతుల్ని చేయాలనుకునే ఆలోచన మంచిదికాదన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలున్న చోట అధికారులకు రక్షణ కల్పించకపోవడం అసలలాంటి విషయమే జరిగినట్లు గుర్తించకపోవడం లేదా అలాంటి నిరసన, లేక నిర్బంధం 'సర్' పర్యవేక్షకుల విధి నిర్వహణను ఆటంకపరచడం ప్రభుత్వ వైఫల్యమే అవుతుంది. 'సర్' ప్రక్రియకు అడుగడుగునా ఆటంకపరిచే ధోరణిలో వ్యవహరిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీదే బాధ్యత అనిఅనుకోవాల్సివస్తోంది. కాగా పశ్చిమబెంగాల్‌లో శాంతిభద్రతల సమస్య ఉన్నట్లు సృష్టించి రాష్ట్రపతి పాలనలోకి మళ్లించాలనే ఆలోచనతో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా కుట్ర చేస్తున్నట్లు బెంగాల్ ముఖ్యమంత్రి ఆరోపణ హాస్యాస్పదంగా ఉంది. అదేదో రాజకీయ నిరసనఅంటూ ప్రభుత్వం ఇచ్చిన వివరణను ధర్మాసనం తోసి పుచ్చింది. మొదట్లో మమతా బెనర్జీ ఓటర్ల జాబితా సవరణ ఓ ఫార్స్‌లా జరుగుతోందని ఆరోపించగానే ధర్మాసనం 700 మంది జ్యుడీషియల్ అధికారులను ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలను పరిష్కరించే పనిలో పెట్టింది. ఎవరి నుండి ప్రేరణపొందినా అధికారుల్ని బంధించే ప్రక్రియచట్టబద్ధం కాదు. ఆహ్వానించదగినది కాదు. ఇంతకుముందు ఐపాక్ కార్యాలయాలపై ఇడిదాడి సందర్భంలోనూ మమత దూకుడు చూశాం.

శత్రువుని గెలవటం కన్నా శత్రుత్వాన్ని నిర్మూలించడం క్షేమ దాయకం.



స్వామి వివేకానంద

వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.



జాకబ్ బ్రౌడి

## ప్రజావాక్కు

### కాలుష్య నియంత్రణ చేపట్టాలి

దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్నివాయు కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టినా తగ్గినట్టు తగ్గిమళ్లీ పెరుగుతుంది. ఢిల్లీలోమాత్రమే కాకుండా ఇప్పుడు ముంబయిలో కూడా వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతుంది. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వంచర్యలు చేపట్టాలి. కట్టెలు, వ్యవసాయ వ్యర్థాలు వల్ల ఏహానీ లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలుచాలా ప్రమాదం. కొన్ని ఆప్రాంతంలో ఉన్న వారికి తక్షణమే శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదం వస్తుంది.

- బి.రాజేశ్వర్, హైదరాబాద్

### జనరల్ బోగీలు పెంచాలి

వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీదృష్ట్యా అదనపు జనరల్ బోగీలుచేరాలి. అలాగే కొనసాగిస్తూ, ప్రత్యేక రైలును వివిధ ప్రాంతాల డిమాండ్‌కు అనుగుణంగా నడిపి పారదర్శకతకు ప్రాధాన్యత ఇవాలి. బాల్యంలో రైలు ప్రయాణమంటే ఏనుగునెక్కినంత సంబరం ఉండేది. కోవిడ్ కష్టకాలంలో సీనియర్ సిటిజన్ టికెట్‌పై రాయితీలు రద్దు చేశారు. ఇప్పటివరకూ పట్టించుకోలేదు. ప్రభుత్వాలు అన్ని విధాలా వయోధికులకు దన్నుగాఉండాలి. కావున కేంద్రం పునరుద్ధరించి వృద్ధుల జర్నీలో ఆనందం పంచాలి.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

### మంచి నీటి సౌకర్యం కల్పించాలి

ఉత్తరాంధ్రలో జిల్లాలో అతిసారంతో మూడు దినాల్లో 76 కేసులు నమోదై ఒకరి మరణం కూడా జరిగింది. ముఖ్యమంత్రి సత్వర ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వెంటనే పది లక్షలు పరిహారం చెల్లించారు. ఈ చర్యఎంతో విలువైనది. పట్టణంలోని కొన్ని వీధులలో పైపుల ద్వారా నీరు వస్తుంది. కానీ ఆ పైపుల బిగింపు వేరుగా ఊడిపోవడం, లేక పైప్ లైన్ పగలడం వల్ల మురికి నీరు మంచి నీటి పైపుల్లోకి వెళుతుంది. దీంతో త్రాగే నీరు పరిశుభ్రత ఉండదు. వీటిని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాలు వెంటనే రిపేర్లు చేయించాలి. గమనించిన ప్రజలు కూడా స్థానిక కార్యాలయానికి తెలియజేయాలి. అందరూ సహకరిస్తే సమస్య ఇంత మందికి ఒకేసారి రాదు. సమస్యను దృష్టిలో ఉంచుకొని పరిష్కారం వైపు అడుగులు వేయాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### రైలు మార్గాలను అభివృద్ధి చేయాలి

సంస్కరణల తరువాత కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున హైవేలు, రోడ్ల విస్తరణల కోసం లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా కూడా, రోడ్డు ప్రమాదాలు మాత్రం ప్రమాదకర స్థాయికి చేరి ఏటా లక్షలమంది చనిపోతూ రెట్టింపు మంది గాయాల పాలవుతూ, మన దేశం ప్రపంచంలోనే ప్రథమ (అధమ)స్థానానికి చేరింది. పూర్వం కాశీకి పోయినోడు, కాటికి పోయినోడు ఒకటే అనే సామెత వుండేది. ఆరోజుల్లో రోడ్డు, బస్సు సౌకర్యాలు, ఆధునిక కమ్యునికేషన్స్ వంటివిలేవు. ఇంటి నుండి బయలు దేరితే, ఎప్పుడు తిరిగి ఇంటికి చేరుకుంటాడో తెలియని స్థితి. ఇప్పుడు హైవేలు, రోడ్లు, రోడ్డుసౌకర్యాలు ఎంత పెరిగినా రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతూ ఈ దుస్థితి వచ్చింది. అడగనిదే అమ్మైనా పెట్టదు అనే సామెతలా తీర ప్రాంత ప్రజలు కూడా గతంలోని జల మార్గాల పునరుద్ధరణ కోసం సంబంధింత ప్రజా ప్రతినిధులపై వత్తిడి తెస్తేనే ఫలితం వుంటుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఒగ్గు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సమాజంలో ఒగ్గుకథలను, బీరప్ప కథలను నమ్ముకుని వాళ్ళ కుటుంబాలను సైతం లెక్కచేయకుండా కథలనే చెప్పుకుంటూ పురాతన కాలసంప్రదాయాలను ఎక్కడ కూడా బోసిపోకుండా నెట్టుకొస్తున్న చాలా మంది ఒగ్గు కళాకారులు ఒగ్గుకథనే వృత్తిగా ఎంచుకుని జీవనం సాగిస్తున్న వాళ్లకు తగిన గుర్తింపును ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా వాళ్ళ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఎంతైనా ఉంది. పురాతన సంప్రదాయాలను భావి తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. అంతరించిపోతున్న ఈ ఒగ్గు కథలకు ప్రాధాన్యత కల్పిస్తూ అందరికి అందుబాటులో ఉండేలా ప్రసారం చేయాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కొడుకు లేదా కోడలు బాధ్యత

ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల పోషణ నిమిత్తం చేసిన జీవో చాలా సంతోషకరం. ఉద్యోగం చేయుచున్న కొడుకు చనిపోయిన తర్వాత అట్టిఉద్యోగి బాధ్యతలను కోడలుకు ఇస్తున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం కోడలు కూడా అత్తమామలను పోషించే బాధ్యత కూడా తీసుకోవాలి. ఒకవేళ కోడలు పోషించకపోతే అత్తమామలకు కోడలు జీతంలో నుండి నెలకు పదివేల రూపాయలు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మద్యాన్ని మట్టుపెట్టే మార్గమే లేదా?

**తెలుగు రాష్ట్రాలకు ఎక్సైజ్ ఆదాయమే ఖజానాకు ప్రధాన ఆర్థిక వనరుగా మారిపోయిందని చెప్పొచ్చు. ఒక్క విషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన మద్యం విధానాలు, అందువల్ల ఆదాయం పెరుగుతున్నా అంతిమంగా సమాజంపై అనేక రూపాల్లో దుష్ప్రభావాన్ని చూపుతున్నది. తాగుడు మూలంగా రహదారి ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస, లైంగిక వేధింపులు లాంటి నేరాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. నిత్యం రహదారులను రక్తసిక్తం చేస్తున్న ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లు అధిక శాతం మద్యం మత్తులోనే వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణాలవుతున్న విషయం అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే ఎన్ని లక్షల కుటుంబాలు ఈ మద్యానికి బానిసై చితికిపోతున్నాయో అంచనాకే అందదు. ఎందరో రోగపీడితులై మంచానికే పరిమితమై తాగి, తాగి కృంగి కృశించి అసువులు బాస్తున్నారు. ఇన్ని అనర్థాలకు మూలమైన మద్యాన్ని పాలకులు పెంచి పోషించడం, ఆదాయం కోసం ప్రజలతో తాగించడం, ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

'దొరతనంబునందు దొంగతనంబు నందు భాగ్యవంతునికి ఏదైనా బాధలేదు' ఇది ఎవరిని ఉద్దేశించి, ఏ సందర్భంలో ఎంతకాలం క్రితం చెప్పారో కానీ అందులో అర్థం, పరమార్థం ఎంతో ఉంది. అంతకు పూర్వం కూడా శ్రీనాథ కవి సిరిగలవానికి ఎందరు భార్యలున్నా పర్వాలేదు కానీ, బిచ్చమెత్తుకునే మీకెందుకు ఇద్దరు భార్యలని ఏకంగా పరమ శివుడినే ప్రశ్నించారు. అప్పుడే కాదు నేడు కూడా లక్ష్మీకటాక్షం లేకపోతే జీవనం సాగించడం ఎంత దుర్భరంగా ఉంటుందో వేరే చెప్పాల్సిన పనిలేదు. వ్యక్తికానీ, కుటుంబం కానీ, సంస్థలు కానీ, చివరకు ప్రభుత్వం కూడా ఆదాయం లేకుండా నడవడం, నడపడం సాధ్యం కాదనేది జగమెరిగిన సత్యం. అందులోనూ ప్రజాసంక్షేమమే ధ్యేయమని చెప్పుకుంటూ నిరుపేద బలహీన బడుగు వర్గాల అభ్యున్నతికి లక్షలాది కోట్ల రూపాయలు వివిధ పథకాల ద్వారా వెచ్చిస్తున్న ఈ రోజుల్లో నిధులు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఇందుకోసం అటుకేంద్రప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ప్రజల మీద భారం వేయకతప్పదు. అందులో మరోవాదనకు తావులేదు. నిధుల సమీకరణకు అప్పులో లేక పన్నులో తప్ప మరో మార్గం లేదనేది తెలిసిందే. అధికారంలో ఎవరున్నా ఏదో ఒక రూపంలో ప్రజలవద్ద నుంచి డబ్బులు వసూలు చేయక తప్పదు. అది సరిపోనప్పుడు అప్పుల బాట ఉండనే ఉంది. కానీ అందుకు ఒక పద్ధతి ఉండాలి. ఒక విధానం ఉండాలి. ఒక మార్గం ఉండాలి. ఎన్నిపన్నులు వేసినా, మరే రూపంలో నిధులు సేకరించే ప్రయత్నం చేసినా అందువల్ల ప్రజలకు కష్టనష్టాలు ఉండకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. కానీ అందుకు ప్రభుత్వాలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయేమోననిపిస్తున్నది. పన్నులు వేసే కొద్దీ ధరలు పెరుగుతాయి. జిఎస్టీ అన్నా, మరే రూపంలో పన్నులు ఏ వస్తువులపై వేసినా చివరకు ఆ భారమంతా మోయాల్సింది ప్రజలనేది వాస్తవం. అంతేకాదు ఈ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని పాలకులు వ్యయం చేస్తున్నారు. కానీ గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితులు మారిపోయాయి. ఆదాయం గురించి పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారంగా పథకాలు ప్రకటిస్తున్నారు. ఓట్ల కోసం సీట్ల కోసం అధికారం కోసం జనాకర్షణ పథకాలు కోకొల్లలుగా ప్రకటిస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో అయితే వరాలకు హద్దే లేకుండాపోతున్నది. ప్రస్తుతం జరగబోతున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల్లో కొన్ని పార్టీలు చేస్తున్న ప్రకటనలు, హామీలు ప్రజాస్వామ్యవాదులు విస్తుపోతున్నారు. అడిగినవే కాదు ప్రజలు కోరనివి కూడా ప్రకటిస్తున్నారు. అవన్నీ పూర్తిగా అమలుచేయాలంటే ఎన్ని లక్షల కోట్ల రూపాయలు కావాలో పట్టించుకోవడం లేదు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు అప్పుల ఊబిలో దిగబడిపోయాయి. నెలనెలా జీతభత్యా లు చెల్లిండానికే నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిట్టను కొట్ట పొయ్యిలో పెట్ట అన్నట్లు ఉంది. మరొక పక్క ఆదాయం పెంచుకునేందుకు నిత్యం అన్వేషణ జరుగుతున్నది. ఇందులో మంచి, చెడుల గురించి కూడా ఆలోచిస్తున్నట్లు లేదు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చెప్పుకుంటున్న పాలకులు చేతల్లోకి వచ్చేసరికి నిధుల సేకరణ ఆరాటంలో అవేమీ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మద్యం ఆదాయాన్ని పెంచుకోవడంలో పాలకులు పడుతున్న ఆరాటంలో ఎందరో బడుగు జీవులు సమిధులై పోతున్నారు. యేడాదియేడాదికి ఎక్సైజ్ ఆదాయం వేల కోట్లల్లో పెరుగుతున్నది. ఈ ఆదాయం ఊహించని రీతిలో పెరుగుతున్నదని ఎక్సైజ్ అధికారులు గర్వంగా చెప్పుకుం టున్నారు. పెంచేందుకు అన్ని మార్గాలను అవలంబిస్తున్నారు.

## ఒక్క మాట

తెలుగు రాష్ట్రాలకు ఎక్సైజ్ ఆదాయమే ఖజానాకు ప్రధాన ఆర్థిక వనరుగా మారిపోయిందని చెప్పొచ్చు. ఒక్క విషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన మద్యం విధా నాలు, అందువల్ల ఆదాయం పెరుగుతున్నా అంతిమంగా సమాజంపై అనేక రూపాల్లో దుష్ప్రభావాన్ని చూపుతున్నది. తాగుడు మూలంగా రహదారి ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస లైంగిక వేధింపులు లాంటి నేరాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. నిత్యం రహదారులను రక్తసిక్తం చేస్తున్న ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లు అధిక శాతం మద్యం మత్తులోనే వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణాలవుతున్న విషయం అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే ఎన్ని లక్షల కుటుంబాలు ఈ మద్యానికి బానిసై చితికిపోతున్నాయో అంచనాకే అందదు. ఎందరో రోగపీడితులై మంచానికే పరిమితమై తాగి, తాగి కృంగికృశించి అసువులు బాస్తున్నారు. ఇన్ని అనర్థాలకు మూలమైన మద్యాన్ని పాలకులు పెంచి పోషించడం, ఆదాయం కోసం ప్రజలతో తాగించడం, ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి. దేశవ్యాప్తంగా కూడా కొన్ని రాష్ట్రాలు నిషేధించినా మద్యం వాడకం అంతకంతకు పెరిగిపోతున్నది. యేటా మద్యం అమ్మకాల విలువ దేశవ్యాప్తంగా దాదాపు ఐదారు లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుందని అనధికార అంచనా. అన్నిటికంటే ముఖ్యంగా అక్రమ సారాను నిరోధించేందుకు ఎవరి ఆలోచనోఏమో కానీ చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు దేశంలోకానీ, తెలుగు రాష్ట్రాల్లో కానీ అధిక శాతం అమ్మకాలు ఈచీప్ లిక్కరే. ఇదే ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నది. ఎందరో నిరుపేదలు ఈ చీప్ లిక్కర్ తాగి అర్థాంతరంగా మరణిస్తున్నారు. కల్తీసారా కూడా ప్రజారోగ్యా న్ని కాటేస్తున్నది. మొన్నామధ్య తమిళనాడులో కల్తీసారా కాటుకు ఏకంగా అరవైమందికి పైగా అమాయకులు బలైపోయారు. తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురానికి చెందిన దంపతులిద్దరు కల్తీసారా తాగి చనిపోయారు. ఇది అధికారులకు సమాచారం అందినా చర్యలుతీసుకోలేదు. పైగా దంపతులు ఇద్దరు చనిపోయారు. కల్తీసారా వల్ల చనిపో యారనే బాధితుల ఆరోణలను కొట్టివేస్తూ కల్తీసారా వల్ల కాదని ఆ జిల్లాకలెక్టర్ అధికారికంగానే ప్రకటించారు. దాంతో ఈ దంపతుల పార్థివదేహాలకు జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న కరుణాపురం వాసులు నూట తొంభై మూడు మంది అదే కల్తీసారా తాగారు. ఆరోగ్యం విషమించి మరుసటి రోజుకు యాభైనాలుగు మంది, ఆ తర్వాత మరో అరడజన్ కుపైగా మృతిచెందారు. జరగాల్సింది జరిగిన తర్వాత స్పందించిన తమిళనాడు ప్రభుత్వం విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినందుకు కలెక్టర్‌ను బదలీ చేసింది. అంతకుముందు తమిళనాడులోని కల్తీసారా రక్కసి ఇరవైమూడు మందిని మింగేసింది. సారా నిషేధం ప్రకటించిన బీహార్ రాష్ట్రంలో కూడా పదిమంది పరలోకానికి పయనంకట్టారు. ఇలా దేశవ్యాప్తంగా ఎందరో బలైపోతున్నారు. పంజాబ్, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సారా మహమ్మారి విజృంభించి ఎన్నో కుటుంబాలను చిదిమేస్తున్నది. ఇందులో చాలా మరణాలు ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్క దంలేదు. గతంలో ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో సారా మహమ్మారి ఇరవైఏడు మంది ప్రాణాలను బలికొన్నది. మృతులుఎందరో రెక్కాడితే డొక్కాడని నిరుపేదలు. ఇలా ఎన్నో ఉదాహరణలను చెప్పొచ్చు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని మన రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. ఏరకంగా చూసినా ప్రజారోగ్యంతో ఆటలాడు తున్న ఈ మద్యాన్ని నిషేధించాల్సిన అవసరం గురించి పెద్దలకు తెలియంది కాదు. అయినా దశలవారీగా తగ్గిస్తామని వేదికలెక్కి ఉపన్యాసాలు, హామీలు ఇచ్చిన పెద్దలే అంచలం చెలుగా విస్తరిస్తున్నారు. మద్యాదాయమే మహాప్రసాదంగా మారిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోయే స్తోమత ప్రభుత్వాలకు లేదని పెద్దలు చెప్తున్నారు. ఈ కారణంగానే బార్లు, షాపులు అవసరమైతే సమయాన్ని అర్థరాత్రివరకు పొడిగించి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. జూదం, వ్యభిచారం, మత్తుపదార్థాలు లాటరీ లాంటివి ప్రభుత్వ ఆదాయవనరులు కారాదని రాజ్యాంగంలోని 47వ నిబంధన స్పష్టం చేస్తున్నది. ఈ నిబంధనలను కొట్టివేయించేందుకు కొందరు మద్యం వ్యాపారులు 1978 లోనే దేశ అత్యున్నత న్యాయస్థానంలో వ్యాజ్యం వేశారు. వాదోపవాదాలు విన్న సుప్రీం కోర్టు మద్యపాన నిషేధాన్ని సమర్థిస్తూ తీర్పుఇచ్చింది. అటు రాజ్యాంగాన్ని, ఇటు న్యాయ స్థానాల ఆదేశాలను పాటించకుండా ఆదాయమే పరమావధి గా పాలకులు వ్యవహరించడం అత్యంత బాధాకరం. ●

# పర్యవేక్షణలోపమే కల్తీలకు ప్రధాన కారణం


చిలగాని జనార్థన్

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఫలితంగా కల్తీ పదార్థాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు సేకరించిన ప్రతీ వంద షాంపిల్స్‌లో 20కి పైగా కల్తీకి గురైనట్లు నివేదికలు చెబుతున్నాయి. 2021-24 మధ్య కాలంలో పార్లమెంటుకు నివేదించిన అహార కల్తీలే ఇందుకు నిదర్శనం. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో భారీగా ఆహార పదార్థాలు, సరుకుల కల్తీలు జరుగుతోన్నా నియంత్రణకు తీసుకున్న చర్యలు నామమాత్రమే. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖకు అత్తెసరు నిధులే కేటాయించిన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో రెండు శాతమే కేటాయించినా ఇందులో ప్రజారోగ్యశాఖ పరిధిలో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఊసే లేకుండా పోయింది. ఆహార కల్తీ నిర్ధారణకు ల్యాబ్‌ల విస్తరణ, సిబ్బంది నియామకం లేనట్లేనని తేలింది. ఏపీలో తిరుపతి లడ్డు, పాల కల్తీ దూమారం రేపుతున్న విషయం తెలిసిందే. గతంలో హైదరాబాద్‌లో మోమోస్ మయోనైజ్ తినడం వల్ల మృతిచెందిన సంఘటనలున్నాయి. తెలంగాణాలోనూ రోజూ ఎక్కడో చోట ఆహార కల్తీలతో అనారోగ్య పాలౌతున్నారు. తరచూ విద్యా సంస్థల్లోని స్టూడెంట్స్ ఫుడ్ పాయిజ్‌కు గురై ఆసుపత్రి పాలౌతున్నారు. మార్కెట్‌లో రోజు తినే వస్తువులు, పదార్థాలు కల్తీయా, నాసిరకమా? అనేది తెలియడంలేదు. ఎక్కువగా కల్తీపదార్థాలు తయారు చేస్తున్నట్లు స్పష్టమోతుంది. పసుపు, కారం, ధనియాలు, పప్పులు, నూనెలు ఇలా నిత్యవసర సరుకులతోపాటు ఇతర వస్తువుల్లో కల్తీ జరుగుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల పరీక్షల్లో స్పష్టమోతుంది. అరటిపండ్లలో ఇథోపాన్ పెస్టిసైడ్, ఆపిల్ పై ప్యారాపిన్, సపోట, దానిమ్మ, సంత్ర వీటిల్లో కార్బైడ్ అవశేషాలుంటున్నాయి. కన్ఫెక్షనరీలో పల్లిపట్టిలో సల్ఫర్ డైయాక్సైడ్, కుర్‌కురే, చాక్‌లెట్స్‌స్వీట్స్ హౌజ్‌ల్లో లడ్డు, జిలేబీ, కేక్‌లలో విచ్చలవిడిగా కలర్స్ వినియోగిస్తున్నారు. దీనివల్ల క్యాన్సర్‌తో పాటు లివర్ సంబంధిత వ్యాధులు కబళిస్తున్నాయి. ఇక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగించే ఆయిల్, కలర్స్, ముడి పదార్థాల గురించి చెప్పనవసరం లేదు. తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్‌ను గుర్తించే ఒకే ల్యాబ్ ఉంది. ప్రతీ రోజు కొన్ని మాత్రమే టెస్ట్ చేసేందుకు వీలుంది. రాష్ట్రంలోని 33జిల్లాలకు వందలోపు ఫుడ్ సేఫ్టీ అధికారులు, సిబ్బందిమాత్రమే ఉన్నారు. సుమారుకోటిన్నర జనాభా గల హైదరాబాద్‌లో 32 సర్కిళ్లలో ఉన్న అరకొర సిబ్బంది వల్ల తనిఖీలు ఏమాత్రం చేయవచ్చో అర్థంచేసుకోవచ్చు. రాష్ట్రానికి ఆరు ఎఫ్ఎస్ఎస్ఐల్యాబ్‌లు, మరో ఆరు మోబైల్ ల్యాబ్‌లు మంజూరు చేయాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. దీనివల్లతనిఖీలు, షాంపిల్స్ సేకరణ పరిమితంగా చేస్తున్నట్లు తెలుస్తుంది. దుకాణాలు, ఆహార ఉత్పత్తి సంస్థల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీ ఇలా అన్నీఇక్కడ చిదంబర రహస్యాలే. ఆహార పదార్థాల తయారీ దారులు, హోటళ్ల యజమానులు, ఇతర దుకాణాదారులు దరఖాస్తులను జీఎఫ్ఐ పరిశీలించి రిజిస్ట్రేషన్, లైసెన్సులు జారీచేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు అహార పదార్థాల కల్తీల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

# ఆకలి బాధలు తీర్చలేని ఆయుధపోటీలెందుకు?

ముద్దం నరసింహ స్వామి

మానవ సమాజం ఎదుట నిలిచిన అత్యంత విరుద్ధమైనవాస్తవం ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది. ప్రపంచం శాస్త్రసాంకేతిక రంగాల్లో ఎన్నడూ లేనంత వేగంగా ముందుకు సాగుతున్న ఈ కాలంలో కూడా కోట్లాది మంది ఆకలితో బాధపడుతున్నారంటే అది మానవ నాగరికతకు ఒక పెద్ద అవమానం. ఒకవైపు కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధనలు, అణు సాంకేతికతలో దేశాలు పోటీ పడుతుండగా, మరోవైపు చిన్నపిల్లలు ఒక్క గింజ అన్నం కోసం ఏడవాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు. ప్రాధాన్యతల సమస్య. ప్రపంచ దేశాలు మానవ సంక్షేమం కంటే ఆయుధ సంపత్తికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయనే విషాదకరమైన వాస్తవాన్ని ఇది బహిర్గతం చేస్తోంది. ప్రస్తుతం ప్రపంచ దేశాల బడ్జెట్లను పరిశీలిస్తే ఒక స్పష్టమైన విరుద్ధత కనిపిస్తుంది. కోట్లాది మంది ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత, ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా, లక్షల కోట్ల డాలర్లు ఆయుధాల తయారీకి వెచ్చించబడుతున్నాయి. ఇది మానవ విలువల కంటే భద్రతా భయాలు, ఆధిపత్య రాజకీయాలు ముందంజలో ఉన్నాయని సూచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 67 కోట్ల మంది తీవ్ర ఆకలితో బాధపడుతున్నారని అంచనాలు చెబుతున్నాయి. మరో 230 కోట్ల మంది సరైన ఆహార భద్రత లేకుండా జీవిస్తున్నారు. ఈసంఖ్యలు కేవలం గణాంకాలు మాత్రమే కావు, ఇవి కోట్లాది కుటుంబాల బాధను ప్రతిబింబించే కఠినమైన వాస్తవాలు. ఆహారం దొరకకపోవడం ఆకలితో అలమటించడంతో పాటు ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. పిల్లల్లో ఎదుగుదల లోపాలు, గర్భిణీ స్త్రీల్లో పోషకాహార లోపం, యువతలో శారీరక బలహీనత వంటి సమస్యలు దీని ప్రభావాలు. దీర్ఘకాలంలో ఇది దేశాల ఆర్థికాభివృద్ధిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆకలి కారణంగా విద్యకు దూరమవుతున్న పిల్లలు భవిష్యత్తులో నైపుణ్యాలు పొందలేకపోతారు. తద్వారా సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయి. ఆకలి ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సమాజాన్ని వెనక్కి నెట్టే ఒక ప్రధాన కారణం. ప్రపంచంలో ఆహార ఉత్పత్తి సరిపడా ఉంది. అయినప్పటికీ ఆకలి సమస్య కొనసాగుతోంది. ఇది వనరుల కొరత వల్ల కాదు, సమాన పంపిణీ లోపం వల్ల. ప్రతి సంవత్సరం కొద్దిపాటి నిధులను సమర్థవంతంగా వినియోగిస్తే ప్రపంచాన్ని ఆకలి నుంచి విముక్తి చేయవచ్చని యునైటెడ్ నేషన్స్ నివేదికలు సూచిస్తున్నాయి. ప్రపంచ సైనిక వ్యయంలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఆకలి నిర్మూలనకు కేటాయించినా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు. అయినప్పటికీ దేశాలు ఆయుధాలపై భారీగా ఖర్చు చేయడాన్ని కొనసాగిస్తున్నాయి. ఇది మనిషి ప్రాధాన్యతలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా చూపిస్తోంది. దేశాలు ఆయుధ సంపత్తిని పెంచుకోవడానికి ప్రధాన కారణంగా భద్రతా అవసరాలను చూపిస్తాయి. ఒక దేశం ఆయుధా



లను పెంచుకుంటే మరో దేశం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తుంది. ఇలా ఆయుధ పోటీ ఒక అంతులేని చక్రంలా కొనసాగుతుంది. కానీ వాస్తవానికి ఈ పోటీ వల్ల భద్రత పెరుగుతుందా? లేక అస్థిరత పెరుగుతుందా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం. ఆయుధాల పెరుగుదలతో దేశాల మధ్య అనుమానాలు పెరుగుతాయి. ఉద్రిక్తతలు పెరుగుతాయి. యుద్ధాల ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచం మరింత సురక్షితంగా మారడం కంటే మరింత ప్రమాదకరంగా మారే అవకాశమే ఎక్కువ. ఒకవైపు చిన్నపిల్లలు ఆకలితో బాధపడుతుండగా మరోవైపు అణుబాంబుల తయారీకి కోట్లాది డాలర్లు ఖర్చుచేయడం ఒక నైతిక సంక్షోభం. ప్రభుత్వాలు ప్రజల పన్నులతో సేకరించిన నిధులను ఆయుధాల కోసం వినియోగించడం సమాజంలో అసంతృప్తిని పెంచుతుంది. ప్రజలు ప్రభుత్వాల నుంచి ఆశించేది భద్రత మాత్రమే కాదు, ఆరోగ్యం, విద్య, ఉపాధి, శుద్ధమైన తాగునీరు, గృహ వసతి వంటి మౌలిక అవసరాలు. కానీ ఈ అవసరాలు పూర్తిగా తీరకముందే ఆయుధాలపై అధిక వ్యయం జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా కనిపిస్తుంది. యుద్ధాలు జరిగే ప్రాంతాల్లో ఆకలి సమస్య మరింత తీవ్రమవుతుంది. వ్యవసాయం దెబ్బతింటుంది. సరఫరా వ్యవస్థలు కూలిపోతాయి. ప్రజలు తమ ఇళ్లను వదిలి శరణార్థులుగా మారుతారు. పిల్లలు విద్యకు దూరమవుతారు. ఇలా యుద్ధాలు ఒక ప్రాంతాన్ని మాత్రమే కాదు, పూర్తి తరాలను ప్రభావితం చేస్తాయి. ఒక దేశంలో జరిగిన యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలను కూడా ప్రభావితం చేస్తుంది. దీని ప్రభావం పేద దేశాలపై ఎక్కువగా పడుతుంది. నిజమైన అభివృద్ధి అంటే ఒక దేశంఎంత శక్తివంతమైన ఆయుధాలు కలిగి ఉందో కాదు, ఆ దేశంలో ప్రజలు ఎంత ఆరోగ్యంగా, సురక్షితంగా, గౌరవప్రదంగా జీవిస్తున్నారో అనే విషయంపై ఆధారపడాలి. ఆకలి లేకుండా జీవించే సమాజం, అందరికీ విద్య అందుబాటులో ఉండే దేశం, అందరికీ ఆరోగ్య సేవలు అందే వ్యవస్థ ఇవే నిజమైన అభివృద్ధి సూచికలు. కానీ ప్రపంచ దేశాలు ఇంకా ఆయుధ శక్తినే అభివృద్ధి ప్రమాణంగా భావిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ పరిస్థితిలో ఎక్కువగా నష్టపోతున్నాయి. ఒకవైపు భద్రతాఅవసరాలు ఉంటాయి. మరోవైపు పేదరికం, నిరుద్యోగం, విద్య లోపంవంటి సమస్యలు ఉంటాయి. ఈ రెండు మధ్య సమతౌల్యం సాధించడం చాలా కష్టం. ఈ దేశాలు రక్షణ వ్యయాన్ని తగ్గిస్తే భద్రతా సమస్యలు ఎదురవుతాయి. పెంచితే సామాజిక అభివృద్ధి మందగిస్తుంది. ఈ ద్వంద్వ పరిస్థితి వారి అభివృద్ధి మార్గాన్ని ప్రభావితం చేస్తోంది. ప్రపంచ దేశాలు తమ ప్రాధాన్యతలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆయుధ పోటీకి బదులుగా మానవ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆకలి నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, విద్యావిస్తరణ వంటి అంశాలను అంతర్జాతీయ రాజకీయాల కేంద్రంగా మార్చాలి. ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి దేశాలు కలిసి పనిచేయాలి. పరస్పర సహకారం ద్వారానే ఆకలివంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. భవిష్యత్తు తరాలకోసం బాధ్యత మనతరం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఆకలి సమస్యను పరిష్కరించకుండా ఆయుధపోటీ కొనసాగితే భవిష్యత్తుతరాలకు అసమానతలతో కూడినప్రపంచాన్ని అందిస్తాం. కానీమానవసంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటేవారికి ఒక సమానత్వంతో కూడిన ప్రపంచాన్ని అందించగలం. ●

## పేదలపై తీవ్రభారం.. బలహీనవర్గాలను ఉన్నతవిద్యకు దూరం చేయడమే

## విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలన్న హైకోర్టు తీర్పుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చేసిన తరువాత తిరిగి ఇవ్వా లని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా యి. ఈ తీర్పుతో పేద లపై తీవ్రమైన ఆర్థికభారం పడుతుం దని విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి వసూళ్లు చేసుకోని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలన్న తీర్పు సరైనది కాదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ అభిప్రాయ పడింది. ఇది విద్యార్థుల చదువుల అభివృద్ధికి గొడలిపెట్టని హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు.

ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని, అలాంటిది ప్రైవేటు యాజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిరక్ష ్యంతో చేస్తున్న ప్రభుత్వానికి ఆదే శాలు ఇవ్వ కుండా, విద్యా ర్థుల నుండి వసూళ్లు చేసుకోండి అనే తీర్పు సరైనది కాదన్నారు. అణాగారిన వర్గాల నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్నా రని ప్రధానంగా ఈ ఫీజులు పొందే వారు పేద విద్యార్థులు వారిలో రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బి.సి,మైనారిటీ విద్యార్థులలే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు బకాయిలు రావడం లేదని పేద విద్యార్థుల సర్టిఫికేట్స్ ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని, గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చాలా చేయాలని, ప్రభుత్వానికి తక్షణమే ఫీజుల విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి మండిపడింది. ఫీజు రియంబర్స్‌మెంట్ రాని విద్యార్థుల వద్ద నుండి ఫీజులు వసూలు చేసుకోమని వచ్చిని, తర్వాత విద్యార్థులకు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. ఈ తీర్పుపై హైకోర్టు పునరాలోచించాలని, రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు ఉన్నత విద్య చదివేది ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడేనని, అలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి బకాయిలు ఇవ్వకుండా గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాలు విద్యార్థుల చదువులతో చెలగాట మాడుతున్నాయన్నారు. ప్రద్య సంవత్సరం పూర్తి అయిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వెళ్తే యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నారని, లక్షలాది మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోకుండా ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా పైసలు కట్టి సర్టిఫికెట్ తీసుకునే ఆర్థిక పరిస్థితులు లేరని, హైకోర్టు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించి ఆలోపు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని, ఫీజులు వసూలు చేసుకోవాలని కళాశాలలకు హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చలనం కలిగి వెంటనే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏకకాలంలో విడుదల చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు.



## గవర్నర్‌కు ఈగల్ ఫోర్స్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్

### డ్రగ్స్ వ్యతిరేక చర్యలపై అధికారుల వివరణ

**పభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 3:** తెలంగాణ ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్ ఫోర్స్) డైరెక్టర్ సందీప్ శాండిల్య , ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈగిల్ ఫోర్స్ కార్యకలాపాలు, డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు అమలు చేస్తున్న వ్యూహాలను వివరించారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు, అమలు చర్యలు, విభాగాల మధ్య సమన్వయంపై వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ కూడా పాల్గొన్నారు.

## మూసీ నదిని శుద్ధి చేశాకే ఆలయాలు, ప్రార్థనా స్థలాలు నిర్మించాలి

### సిఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** మూసీ నదిలో ఆలయాలు, ప్రార్థనా స్థలాల నిర్మాణంపై సర్కారు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అభిప్రాయపడింది. మొదట మూసీ నదిని పూర్తిగా శుద్ధి చేసిన తరువాత ఆలయాలు, ప్రార్థనా స్థలాలు నిర్మించడం బాగుంటుం దని సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. మూసీ నది పునరుద్ధరణకు సర్కారు నిర్ణయించడం సరైన నిర్ణయమని ఆయన తెలిపారు. అయితే ఇది పూర్తికాక ముందే ఆలయాలతో పాటు నది మధ్యలో 108 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటుకు సర్కారు నిర్ణయించడం సవ్యంగా లేదని ఆయన తన లేఖలో తెలిపారు. ఇంతకు ముందు మూసీ నదిని శుద్ధి చేసేందు కు, కలుషిత నీరు చేరకుండా వుండేందుకు వాటర్ వర్క్స్ బోర్డు అనేక పథకాలు అమలు చేసినా ఏదీ సరిగ్గా లేదని ఆయన తెలిపారు. ఆఖరుకు హైకోర్టు వద్ద కలుషిత జలాలను నిరోధించేందుకు 50 కోట్ల రూపాయలతో నిర్మించిన రబ్బర్ డ్యాం కూడా పనికిరాకుండా పోయిందని ఆయన పేరొ ్కన్నారు. ఆ తరువాత వాటర్ వర్క్స్ బోర్డు రూపొందించిన పలు ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించి ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి పక్కాగా రావాలని ఆదేశించిందని పద్మనాభ రెడ్డి గుర్తు చేశారు. చివరగా 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందని, మూసీలో కాలుష్యజలాలు కలుస్తూనే వున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ నదిలో కాలుష్య జలాలు రాకుండా చూడడంతో పాటు ఎంపిక చేసినచోట్ల ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించాలని, వీటివల్ల కాలుష్యం మూసీలో చేరకుండా నిరోధించవ చ్చని ఆయన, తద్వారా నదీ తీరం వెంట ఆహ్లాద వాతావరణం వుండేలా చూడ వచ్చని ఆయన తెలిపారు. అప్పటి వరకు ఆలయాలతోపాటు ప్రార్థనా స్థలాల నిర్మాణంపై సర్కారు తన నిర్ణయాన్ని ఆపాలని ఆయన కోరారు.

## దొడ్డి కొమురయ్యకు నివాళులు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి, తెలంగాణ ప్రజల్లో పోరాటస్ఫూర్తిని నింపిన చైతన్య జ్వాల దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మాన వాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ ఇవే ఏసు క్రీస్తు మానవాళికి ఇచ్చిన సందేశాలనీ గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రీస్తు బోధన లను గుర్తుచేసుకుందామని మహేష్‌కుమార్‌గౌడ్ హితవు చెప్పారు. దొడ్డి కొమురయ్య, ఏసుక్రీస్తు జీవితాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఉన్నత విలువలు స్థాపించడానికి మనం ముందుకుపోవాలని కోరారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఐలయ్య, దత్తాత్రేయ, నిరంజన్ తదితరులు

## జనగామ జిల్లా, విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### విద్యతోనే అభ్యుదయం : హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** తెలంగాణలోని జనగామ జిల్లాకు, ఇక్కడ నిర్మించనున్న విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరుపెట్టేలా కృషిచేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య భరోసానిచ్చారు. విద్య ఉంటేనే ఎవ్వరికైె తగిన గుర్తింపు ఉంటుందని, తాను చదువుకున్నాను కాబట్టే ఎంపి, కేంద్రమంత్రితోపాటు గవర్నరు స్థాయికి చేరుకున్నానని, విద్యతోనే అభ్యుదయం... ప్రతీఒక్కరూ తమ పిల్లలను ఉన్నతవిద్యావంతుల్ని చేయాలని హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌ల పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ సూచించారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలకు హాజరైన ఐలయ్య, బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్, జయంతోత్సవ కమిటీ సభ్యులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘననివాళులర్పించి ప్రసంగించారు. ఐలయ్య మాట్లాడుతూ కొమురయ్య పోరాటపటిమను యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసి వచ్చే జయంతినాటికి ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కురుమలకు కోకాపేట భూమి విషయంలో కొంతమంది రాజకీయం చేస్తున్నారని, కురుమ పిల్లల చదువుకు ఉపయోగపడుతుందని కులాభ్యున్నతికే కొంత భూమిని లీజ్‌గా ఓ స్కూల్‌కి ఇస్తే ఆ నిర్ణయాన్ని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బండారు దత్తాత్రేయ దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఒకేఒక్కరున్న ఎమ్మెల్యే వచ్చే ఎన్నికల్లో 10మంది ఎమ్మెల్యేలు కావాలని ఆకాంక్షించారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కేశవరావు తదితరులు

## విద్యాకమిషన్ కేవలం నివేదిక ఇచ్చింది

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** కొంతకాలం క్రితం విద్యా కమిషన్ ఇచ్చిన ఎడ్యుకేషన్ పాలసీ కేవలం నివేదిక మాత్రమే అని, దీనిపై ఇంకా కసరత్తు జరగాల్సి న అవసరం ఉందని 20 రోజులలో వెబ్ సైట్‌లో పబ్లిక్ డొమైన్ రూపంలో దానిని ఉంచుతామని, తదనంతరం వచ్చే సలహాలు సూచనలు స్వీకరించి మార్పులు చేర్పులు చేసిన తర్వాత తుది రూపు ఇచ్చి ప్రభుత్వానికి అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో "నూతన విద్యా పాలసీ దాని పర్యవసానాలు" అనే అంశంపై సకల జనుల వేదిక, తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం సంయుక్తంగా ప్రొఫెసర్ లక్ష ్మణ్ , ప్రొఫెసర్ వినాయక రెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన వక్తలుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ, ఉపాధ్యాయ సంఘం నేత మోహన్ రెడ్డిలతో పాటు ప్రొఫెసర్‌లు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ విద్యాపాలసీపై ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదని, జీతాల పెరుగుదల ఉంటుంది తప్ప తగ్గించే ప్రసక్తే ఉండదన్నారు. ముగ్గురు వైస్ ఛాన్స్ లర్ లతో పాటు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యపై పనిచేస్తున్న ఎన్జీవో సంస్థలు, విద్యార్థి సంఘాలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

రాష్ట్ర నీటిపారుదల శాఖ మాజీ ఛైర్మన్ వి ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం వేసిన విద్యా కమిషన్ కి ప్రత్యామ్నాయంగా సకలజనుల వేదిక, తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఒక పీపుల్స్ కమిషన్ ను ఏర్పాటు చేయాల్సి న అవసరం ఉందని ఈ కమిషన్ గ్రామీణ స్థాయి నుంచి పట్టణం వరకు అటు ప్రజల, విద్యార్థుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఒక మంచి పాలసీని రూపొందించి ప్రభుత్వానికి అందించాలని సూచించారు.

## ముఖ్యమంత్రి బాసర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర పర్యటనకు సం బంధించి ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముందుగా బాసర చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగ ణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచ నాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్య మంత్రి శంకుస్థాపనలు చేయ నున్న ప్రదేశాలను మంత్రులు పరిశీలించి, అధికా రులకు కీలక సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బం దీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రాజన్న అతిథి గృహంలో నిర్వహించిన సమా వేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాసర అభివృద్ధి పను లకు సంబంధించి రూ.300 కోట్లతో దేవాల యాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ ఛైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్, కలెక్టర్

## రాష్ట్రంలో ఏమేమి హామీలు అమలు జరిగాయో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏమేమి హామీలు అమలు జరిగాయో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు వివరిం చాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయ డమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో చేసిన ఆరు వాగ్దానాలను సక్రమంగా అమలు చేశామని, అవసరమైతే కేరళ రాష్ట్ర మంత్రివర్గం వచ్చి వాటిని పరిశీలించవచ్చని అన్నారు. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వం సాధించిన విజయాలను తగ్గిస్తూ, కించపరచే విధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం ఏమి సాధించిందో ఇక్కడ ఉన్న సిపిఐ, సిపిఎం నాయకులకు వివరిస్తే సరిపోతుందన్నారు. రేవంత్ సర్కార్ కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ అమలు జరగలేదన్నారు, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేశారని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏవైతే సెలక్షన్స్ జరిపిందో ఆయా ఉద్యోగాలను భర్తీ చేశారే తప్ప కొత్తగా ఇచ్చిందేమీ లేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానన్న హామీ అటకెక్కించారని, రైతులందరికీ రెండు లక్షల చొప్పున రుణమాఫీ హామీ కొంతమంది వరకే అమలు చేశారని, రైతు భరోసా పేరుతో ప్రతి రైతుకు ఎకరాకు రూ. 15 వేలు చొప్పున ఇస్తా మన్న హామీ కనీసం మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా అమలుకాలేదన్నారు . కౌలు రైతుల గురించి మాట్లాడే పరిస్థితి కూడా లేకపోయిందన్న రామకృష్ణ.. తెలంగాణలో పెన్షన్ మొత్తాన్ని రూ. 4,116లకు పెంచుతామని చెప్పిన హామీ నెరవేర లేదన్నారు.

యువ వికాసం పేరుతో ప్రతి ఒక్కరికి రూ. 5 లక్షలు ఇస్తామన్నారని, మహాలక్షి ్మ పథకం కింద ప్రతినెల రూ. 2,500 చొప్పున మహిళలకు ఇస్తామన్నారని, గ్యాస్ సిలిండర్ రూ. 500 లకే ఇస్తామన్నారు, చివరికి తెలంగాణ ఉద్యమకారులు అందరికీ 200 గజాలు చొప్పున స్థలాలు ఇస్తామ న్నారని.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఈ వాగ్దానాలన్నీ ఏమాత్రం అమలుకాలేదని రామకృష్ణ గుర్తు చేశారు.

ఇవేమీ అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి కేరళ రాష్ట్రం వెళ్లి, తెలం గాణలో ఏవేవో అద్భు తాలు జరిగినట్లుగా అసత్యా లు వల్లే వేయడం తగదన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఎక్కడ అమలు జరిగాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

## అబ్కారీ శాఖలో కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లకు సొంత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలి

### 8 ఎఫ్ నిబంధనతో పదవీవిరమణకు దగ్గరగా ఉన్న కానిస్టేబుళ్లలో ఆందోళన: జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్. హెడ్ కానిస్టేబుళ్ళు వారి స్వంత జిల్లాల్లో పని చేయకూడదు అన్న నిబంధన ను ఎత్తి వేయాలనీ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ళ సాధారణ బదిలీలలో భాగంగా ఐదురోజుల క్రితం ఎక్సైజ్ శాఖ బదిలీ నిబంధనల ను విడుదల చేసింది. ఈ నిబంధన ల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్లు ఇప్పటి వరకు పనిచేస్తున్న, వారి స్వంత జిల్లాలలో పనిచేయకూడదని 8ఎఫ్ క్లాజ్ ను చేర్చారని కింది స్థాయి ఉద్యోగుల విషయం లో ఇలాంటి నిబంధన విధించడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిబంధన వల్ల సంగారెడ్డి జిల్లాలోని 150 మంది కానిస్టేబుళ్ల కుటుంబాలు,రాష్ట్ర వ్యాప్తంగా 3000 కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ ఆవేదన వ్యక్తంచేశారు. రెండు సంవత్సరాల్లో రిటైర్ అయ్యే హెడ్ కానిస్టేబుళ్ళు సైతం ఈ నిబంధన వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారనీ ఆయన సిఎంకు ఎక్సైజ్ మంత్రికి తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉండటం తో పాటు, వారి పిల్లల చదువుల పై సైతం తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ విషయాలన్నీ పరిగణలోకి తీసుకుని మానవతా దృక్పథం తో ఈ 8 ఎఫ్ నిబంధను వెంటనే తొలగించాలని, ఈ విషయం లో పునరాలోచించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లను మీడియా ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నానీ తెలిపారు.సంగారెడ్డి జిల్లా లో ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ళు 150 మంది నా దగ్గర కు వచ్చి నన్ను కలిసి వారి సమస్యను విన్నవించారనీ తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళమని వారు నాకు విజ్ఞప్తి చేశారు.సమయాభావం ,అత్యవసర పరిస్థితి ఉన్నందున వెంటనే ఈ సమస్యను పరిశీలించి నిబంధన ను ఎత్తి వేయాలని , ఎవరికి ఇబ్బంది కలగకుండా బదిలీలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ మంత్రిని, ముఖ్య మంత్రిని ఆయన కోరారు.

## కుల గణనలో బిసిలకు అన్యాయం

### ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబిసి వివరాలు సేకరించాలి

### నేడు అన్ని బిసి సంఘాలు, మేధావులతో సమావేశం

### మాజీ ఎంపి వి.హనుమంతరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** కులగణనలో బిసిలకు తీవ్రఅన్యాయం జరుగబోతున్నదని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి వి.హను మంతరావు అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలోని తన నివాసంలో విహెచ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీలతోపాటు ఓబీసీల వివ రాలు సేకరించాలని డిమాండ్ చేశారు. 'కులగణనలో ఎస్సీ, ఎస్టీల కులాల వివరాలు మాత్రమే తీసుకుంటారా?మా ఓబీసీల వివరాలు తీసుకోరా.. ఓబీసీలు అంటే పట్టదా మీకు.. ఓబీసీలు కూడా బిలోప్రావర్టీలో ఉన్నారు. వారి వివరాలు కూడా సేకరించాలి. కులగణనతో ఎవరికి లాభం..జనాభా వివరాలు సేకరించే లిస్ట్‌లో ఎస్సీ ఎస్టీలతో పాటు ఓబీసీల వివరాలు కూడా సేకరించాలి' అని డిమాండ్ చేశారు. 'రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లారేషన్ ప్రకారం అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్ బిల్లు తెచ్చాం. బిసి రిజర్వేషన్ల కోసం సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా కూడా చేశారు. బిసి రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వలేదు. ఇబిసిలకు 10శాతం రిజర్వేషన్లు ఇస్తే తాము వ్యతిరేకించ లేదు. మాకు రిజర్వేషన్లు అమలు చేయకుండా కోర్టుకెళ్లి స్టేతీసుకొని వచ్చారు. నేడు కులగణనలో కూడా తీవ్ర అన్యాయం. 'ఇప్పుడు మనం మేల్కొనకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసిన వారం అవుతాం. మోడీ రిమోట్ కంట్రోల్ అంతా మోహన్‌భగవత్ దగ్గర ఉన్నది. ఓట్లు వేయడానికి ఉదయమే లైన్‌లో నిలబడేది ఎస్సీ ఎస్టీ బీసీ మైనా ర్టీలే ముందు వరుసలో ఉంటారు. మన ఓట్లు వాళ్లకు కావాలి.. మన ఓబీసీ లెక్కలు కేంద్ర ప్రభుత్వానికి వద్దా. ఇప్పుడు యుద్ధం చేయక పోతే.. భవిష్య త్తులో బీసీల భవిష్యత్తు అంధకా రమే. జనంలోకి పోవాలి. బీసీలకు జరు గుతున్న అన్యాయాన్ని వివరించాలి. కేంద్ర కులగణన అనేది బోగస్. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అన్ని బిసి సంఘాల నాయకులతో, మేధావులతో మాట్లాడి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం' అని వి.హనుమంతరావు ప్రకటించారు.

### మునుపెన్నడూ లేనివిధంగా పెరిగిన బీర్ల విక్రయాలు

### మద్యంపైనా యుద్ధం ఎఫెక్ట్.. బాటిళ్ల తయారీలో ఆటంకాలు

## మద్యం అమ్మకాల్లో తెలంగాణ తిరుగులేని రికార్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మద్యం విని యోగం మునుపెన్నడూ లేని విధంగా కొత్త రికార్డులను సృష్టించింది. తాజాగా ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు ఈ విష యాన్ని స్పష్టం చేస్తు న్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 1, 2025 నుండి మార్చి 31, 2026వరకు) రాష్ట్రంలో బీర్ల వినియోగం ప్రభంజనం సృష్టించింది. అంతకు ముందు యేడాది 136 లక్షల కేసులుగా ఉన్న బీర్ విక్రయాలు, ఈసారి ఏకంగా 232 లక్షల కేసులకు చేరాయి. అంటే దాదాపు 70.29 వృద్ధి నమోదైంది. వీటితోపాటు భారతీయ తయారీ మద్యం విక్రయాలు కూడా 362 లక్షల కేసుల నుండి 414 లక్షల కేసులకు (14.59శాతం వృద్ధి) పెరిగాయి. దీనితోమద్యం అమ్మకాల మొత్తం విలువ రూ. 29,440 కోట్ల నుండి రూ. 31,237 కోట్లకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు భారీగా పెరిగినప్ప టికీ, ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయ వృద్ధి మాత్రం నామమాత్రంగానే ఉండటం గమనార్హం. మద్యం విక్రయాల విలువ 6.11శాతం పెరిగినప్పటికీ, ప్ర భుత్వానికి వచ్చే నికర ఆదాయ వృ ద్ధి కేవలం 0.68 శాతం మాత్రమే నిలిచి పోయింది. దీనికి దారితీసిన ప్రధాన కారణాలను అబ్కారీ శాఖ ఇలా విశ్లేషించింది. దీనికి ముఖ్య కారణం మార్కెట్లోకి వచ్చిన రూ. 99 (180 మి.లీ) బాటిళ్లకు ఆదరణ పెరిగింది. సామాన్యులు తక్కువ ధర బ్రాండ్లను ఎంచుకోవడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 442 కోట్ల ఆదాయం తగ్గింది. అలాగే ప్రముఖ బ్రాండ్ల ధరలను ప్రభుత్వం తగ్గించడంతో సగటు బాటిల్ ధర రూ. 180 నుండి రూ. 160కి పడిపోయింది. దీనివల్ల దాదాపు రూ. 972 కోట్ల మేర రాబడి తగ్గింది. వీటితోపాటు గత ఏడాది వచ్చిన రూ. 1,900 కోట్ల నాన్‌రీఫండబుల్ ఫీజులు ఈసారి రాకపోవడం కూడా మొత్తం ఆదాయంపై ప్రభావం చూపింది.

కాగా.. మిడిల్ ఈస్ట్ యుద్ధం అన్ని రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభా వం చూపుతోంది. అన్ని రంగాలు గ్యాస్ కొరత కారణంగా ప్రభావితమవుతుండగా తాజాగా యుద్ధం మందుబాబుల పాలిట శాపంగా మారుతోంది. అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మద్యం బాటిళ్ల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఆ పెంపు భారం మద్యం ప్రియుల జేబులు గుల్ల చేయడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో ఈ వేసవిలో చల్లగా చిల్ అవుదామనుకునే మందుబాబుల మాడు పగలగొట్టేలా కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం తయారీలో ఉపయోగించే ముడి సరుకు కంటే ప్యాకేజీ ఖర్చే కంపెనీలకు భారంగా మారింది. మద్యం బాటిళ్లు తయారు చేయారీలో గాజు ఫర్నేస్(కొలిమి)లను నిరం తరం మండించాల్సి ఉంటుంది. దీనికి గ్యాస్ తప్పని సరిగా కావాలి. అయితే భారత్ తన సహజవాయువు అవసరాల కోసం 40 శాతం వరకు ఖతార్ పైనే ఆధారపడుతోంది. అయితే యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. బీర్ తయారీ ఖర్చులో ప్యాకేజింగ్ వాటా 40 శాతం కాగా, స్పిరిట్స్ (విస్కీ, బ్రాండీ తదితరాల్లో) ఇది 20 శాతం వరకు ఉంటుంది. గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడటం వల్ల అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతు న్నాయి. ప్రస్తుతం పెరిగిన గ్యాస్ కష్టాలు, కమర్షియల్ గ్యాస్ ధరల వల్ల గాజు బాటిళ్ల ధర 1520 శాతం పెరినట్లు ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ చోప్రా అంచనా వేశారు. వీటికి అదనంగా షిప్పింగ్ చార్జీలు తోడవడంతో కంపెనీలు అదనంగా 10 -15 శాతం ధరలు పెంచాలని కోరుతున్నాయని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఇలాగే కొనసాగితే గాజు ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో పని చేయకగా బాటిళ్ల కొరత ఏర్పడే అవకాశం ఉంది.

## 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** రాష్ట్రంలో 100 నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు..25 ఎకరాల్లో 5 నుంచి 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2500 విద్యార్థులతో 20 వేల కోట్ల తో నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఒ ప్రైవేటు విద్యాసంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండో విడతలో మరిన్ని స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ విద్య పైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది..దేశంలో అన్ని ప్రాంతాలకు ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఒక విద్యార్థి పైన రాష్ట్ర ప్రభుత్వం లక్షా 8 వేల రూపాయలు ఖర్చు పెడుతోందని వివరించారు. ఏఐ కారణం గా పెద్దయెత్తున ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఉందన్నారు..వైట్ కాలర్ ఉద్యోగాలకు బదులు బ్లూ కాలర్ ఉద్యోగాలకు పెంచ కోవాల్సిన అవసరం ఉంది..ఇందుకోసం నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉత్తీర్ణత సాధిస్తున్నారు..ఎక్కువ మంది విద్యార్థులకు సర్టిఫికేట్ ఉంటుంది కానీ స్కిల్స్ ఉండటం లేదన్నారు. ఆనంద్ మహీంద్రా చైర్మన్ గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ స్కూల్స్‌లో 18 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే 11 వేల ప్రైవేట్ స్కూల్స్‌లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్య వైఫల్యం పైన అందరూ ఆలోచించాలి..పేదరికానికి కారణం విద్య లేకపోవడమే..విద్య వల్లనే గుర్తింపు,గౌరవం లభిస్తుందని చెప్పారు..అరుట్ల మోడల్ స్కూల్లో నాణ్యమైన విద్య అందుతుంది..తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ స్కూల్స్‌లో నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, భోజనం అందిస్తాం..ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు..2034 లో జరగబోయే ఒలంపిక్స్‌లో తెలంగాణ నుంచి గోల్డ్ మెడల్స్ తీసుకు రావడమే లక్ష్యంగా తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బాక్సర్ నిఖత్ జరీన్,క్రికెటర్ సిరాజ్‌కు డిఎస్పీ ఉద్యోగం ఇచ్చామని పేర్కొన్నారు.

## బాలికలు గర్భిణులైతే సమాచారమివ్వండి

### ఆస్పత్రులకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశం



**బెంగుళూరు, ఏప్రిల్ 3:** బాలల పై లైంగిక నేరాల నుండి రక్షణ (పోక్సో) చట్టం, 2012 కింద క్రిమినల్ విచారణ ప్రారంభించేందుకు వీలుగా, 18 ఏళ్లలోపు బాలికల గర్భధారణ కేసులను రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులు నివేదించాలని కర్ణాటక ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, ఏదైనా ప్రైవేట్ ఆసుపత్రిలో బాలిక గర్భధారణ కేసు నమోదైతే, సంబంధిత వైద్యుడు వెంటనే సమీపంలోని ప్రత్యేక బాలల న్యాయ పోలీస్ విభాగానికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయడం తప్పనిసరి. ఈ ఆదేశాలను పాటించని వైద్యులు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. "కేసులను నివేదించడంలో విఫలమైన వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి" అని తక్షణమే అమల్లోకి వచ్చే మార్గదర్శకాలు పేర్కొన్నాయి. పోక్సో కింద గర్భిణీ మైనర్ల గురించి నివేదించాలని ప్రైవేట్ ఆసుపత్రులను కర్ణాటక ఆదేశించింది. "లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం 2012 ప్రకారం, 18 ఏళ్లలోపు బాలిక గర్భం దాల్చడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. దీని గురించి సమాచారం ఇవ్వడం తప్పనిసరి" అని ప్రభుత్వం తన మార్గదర్శకాలలో పేర్కొంది.

## 36 గంటలపాటు మీ సేవలు బంద్

### సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ నేపథ్యంలో నిర్ణయం

### సోమవారం యథావిధిగా సేవలు అందుబాటులోకి

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు షాకింగ్ న్యూస్. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ సేవలను సులువుగా అందిస్తున్న మీ సేవ సర్వీసులు నిలిపివేయనున్నారు. శుక్రవారం రాత్రి నుంచి అన్ని రకాల ఆన్ లైన్ మీ-సేవలు బంద్ కానున్నాయి. తాత్కాలికంగా 36 గంటల పాటు సేవలు ఆగిపోతున్నాయి. శనివారం, ఆదివారం రెండు రోజుల ప్రజలకు మీ సేవలో సేవలు అందుబాటులో ఉండవు. తిరిగి సోమవారం నుంచి సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. సేవలు నిలిపివేయనుండటంతో మీ సేవ కేంద్రాలు కూడా ఖాళీగా ఉండనున్నాయి. షెడ్యూల్ మెయింటెనెన్స్ కారణంగా సేవలు నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. మీ సేవ పోర్టల్‌కు కొత్తగా తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో షెడ్యూల్ మెయింటెనెన్స్ కారణంగా సేవలు నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో "మీ సేవ కేంద్రాల వద్ద 'సేవలు నిలిపివేయనున్నాయి'" అంటూ ఓ పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లోనూ సమాచారం అందిస్తున్నారు. మీ-సేవ సర్వీసులు రెండు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నారని, ప్రజలకు సహకరించాలని కోరుతున్నారు. ఏదైనా అత్యవసర పనులు ఉంటే ముందుగానే చేసుకోవాలని చెబుతున్నారు.

## భవనం నిర్మాణానికి ముందు నేల బలం ముఖ్యం

### భూసంబంధిత పరీక్షలు ముఖ్యం

### ఇంపార్టెన్స్ ఆఫ్ జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ రికమెండేషన్స్ సదస్సులో బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** భవన నిర్మాణాలకు ముందు భూ పరీక్షలను మున్సిపాలిటీలు కఠినంగా అమలు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. శనివారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్‌లో నిర్వహించిన ఇంపార్టెన్స్ ఆఫ్ జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ రికమెండేషన్స్ సాంకేతిక సదస్సులో ముఖ్య అతిథిగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ఒకప్పుడు హైదరాబాద్‌లో ఒక ప్రముఖ భవనం పేకమేడలా కూలిపోయిన ఘటన మనందరికీ గుర్తుందని, ఆ సంఘటన తర్వాత ప్రతి నిర్మాణానికి ముందు సైట్ టెస్టింగ్‌ను తప్పనిసరి చేశారన్నారు. ఆ సమయంలో నా తండ్రి, నా అన్న, మా కుటుంబానికి చెందిన డాక్టర్ బాబూరావు ఈ సైట్ టెస్టింగ్ పనుల్లో పాల్గొన్నారు. అప్పుడే ఈ ప్రక్రియ ఎంత ముఖ్యమో నాకు స్పష్టంగా తెలిసిందన్నారు. ఒక భవనం నిర్మాణానికి ముందు నేల బలం ఎంత ఉంది? భూమి ఎంత బరువును తట్టుకోగలదు? నిర్మాణానికి అవసరమైన సామర్థ్యం ఎంత? అనే విషయాలు జియోటెక్నికల్ పరిశీలన ద్వారా తెలుసుకుంటారన్నారు. ఈ పరీక్షలు లేకపోతే భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక డిజైన్లు, భారీ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నాయి. హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు వేగంగా నిర్మించబడుతున్నాయి. నిర్మాణ ఖర్చు, సమయం రెండూ తగ్గాయి. గతంలో రెండు సంవత్సరాల్లో పట్టిన పనులు ఇప్పుడు ఆరు నెలల్లో పూర్తవుతున్నాయి. ప్రభుత్వ విభాగాలు, ముఖ్యంగా నిర్మాణాలను నియంత్రించే మున్సిపల్ సంస్థలు జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌ను తప్పనిసరి చేసే విధంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలి. అలా చేస్తే భవనాల భద్రత, భవనం ఎక్కువ సంవత్సరాలు మన్నుతుందన్నారు.

# గ్రామ సభలు విజయవంతం

## ప్రజలు, అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా పూర్తి కావడంపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజా పాలనను బలోపేతం చేసే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో సహకరించారన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.గ్రామ సభల్లో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సమస్యలు, పారిశుధ్యం,మౌలిక వసతులపై విస్తృతంగా చర్చలు జరగడం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తపరిచి, అధికారులు వాటిని శ్రద్ధగా స్వీకరించడం ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ దివ్యాదేవరాజన్, అన్ని స్థాయిలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధితశాఖల అధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి ప్రజాపాలనా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గ్రామం కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించడం ద్వారా అభివృద్ధి పరిపూర్ణమవుతుందని పేర్కొన్నారు. ఇకపై గ్రామ సభల్లో వచ్చిన సూచనలు, సమస్యలను ప్రాధాన్యతతో తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## గ్యాస్ అక్రమార్కులపై పౌర సరఫరాల శాఖ ఉక్కుపాదం

### 3,699 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు సీజ్

### 1,275 మందిపై కేసులు నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యం లో రాష్ట్రంలో గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందాపై పౌరసరఫరాలశాఖ ఉక్కుపాదం మోపుతోంది. నిత్యం తెలంగాణలో పౌరసరఫరాల శాఖ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. అక్రమ గ్యాస్ నిల్వలు, బ్లాక్‌లో విక్రయాలపై దాడులు కొనసాగుతున్నాయి. కమర్షియల్ అవసరాల కోసం గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను వాడుతున్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై అధికారులు దాడులు నిర్వహించి సిలిండర్లను సీజ్ చేశారు. గృహ, కమర్షియల్ గ్యాస్ బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకుండా పౌరసరఫరాలశాఖ ప్రత్యేక తనిఖీ చేపట్టింది. ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి నిజమైన లబ్దిదారులకే పంపిణీ జరిగేలా చర్యలు చేపడుతోంది.

డొమెస్టిక్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు సోదాలు చేసి పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. వంటింటి గ్యాస్ యాజమానులు కూడా అధిక ధరలకు విక్రయించాలని భావిస్తే ఉన్న గ్యాస్ కనెక్షన్ తొలగించాల్సి వస్తోందని పౌరసరఫరాల శాఖ హెచ్చరిస్తోంది. మధ్య పాశ్చ దేశాలతో యుద్ధం కారణంగా గ్యాస్ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తూ కొరత లేకుండా చర్యలు చేపట్టారు. రాష్ట్ర పౌరసరఫరాల అధికారులు బ్లాక్‌మార్కెట్ అమ్మకాలపై తనిఖీలు చేపట్టడంతో గత 12వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు గృహ అవసరాలకు వినియోగించే 3699 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

70 చిన్న సిలిండర్లను సీజ్ చేసినట్లు పౌరసరఫరాలశాఖ కమిషన్ స్టిఫెన్ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన సిలిండర్ల విలువ రూ.1కోటి 10లక్షలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. గ్యాస్ అక్రమార్కులపై ఇపనపటి వరకు 1275 కేసులు నమోదు చేయగా 216మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్ ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మహనీయులైన బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దేశ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఈనెల 5, 14 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియం వద్ద ఇందుకు సంబంధించి వివిధ దళిత సంఘాల నాయకులు, కళాకారులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలు, విగ్రహాల వద్ద కార్యక్రమాల రూపకల్పన, ప్రజల సౌకర్యాలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశానికి పరిష్కారం చూపడం ద్వారా ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలు సామాజిక న్యాయానికి బలమైన పునాది వేస్తున్నాయన్నారు.

బాబూ జగ్జీవన్ రావ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ... ఒక పేద కుటుంబం నుంచి ఎదిగి దేశ ఉప ప్రధానిగా కీలక బాధ్యతలు నిర్వహించి వ్యవసాయం, రక్షణ రంగాల్లో దేశాన్ని బలోపేతం చేసిన మహనీయుడిగా కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని నిర్మించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత దిశానిర్దేశం చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, స్వాభిమాన జీవనానికి ఆయన చూపిన మార్గం దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. విద్య, చైతన్యం ద్వారా అణగారిన వర్గాలను ముందుకు తీసుకురావాలనే ఆయన ఆశయాలను ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తోందని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, డాక్టర్ వివేక్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని మంత్రి తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో ఇంధన సంక్షోభం

### దేశం మొత్తం పాక్షిక లాక్‌డౌన్

### ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకే కార్యకలాపాలు



**ఢాకా, ఏప్రిల్ 3:** ప్రస్తుతం పశ్చిమాసియాలో చెల రేగుతున్న ఇరాన్ యుద్ధ జ్వాలలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా దిగుమతులపై ఆధారపడే బంగ్లాదేశ్ వంటి దేశాలు తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొం టున్నా యి. డాలర్ల నిల్వలు తగ్గడం, చమురు ధరలు పెరగడం వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడింది. ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్క డానికి తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలోని ప్రభుత్వం అత్యవసర పొదుపు మంత్రాన్ని పఠిస్తోంది. బంగ్లాదేశ్ తన ఇంధన అవసరాల కోసం దాదాపు 95 శాతం ఇతర దేశాలపైనే ఆధారపడుతోంది. ఈ కష్టకాలంలో పొరుగు దేశం భారత్ వెన్నుదన్నుగా నిలిచింది. ఇప్పటికే బంగ్లాదేశ్ విజ్ఞప్తి మేరకు సుమారు 5 వేల టన్నుల డీజిల్‌ను భారత్ అదనంగా సరఫరా చేసింది. కేవలం బంగ్లాదేశే కాకుండా, శ్రీలంక, మాల్దీవులు కూడా ఇంధన సాయం కోసం భారత్ వైపు చూస్తుండటం గమనార్హం. ఇది దక్షిణా సియాలో భారత్ ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. విద్యుత్ ఆదా చేయడమే లక్ష్యంగా ప్రభు త్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆఫీసులు ఇకపై ఉదయం 9 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4 గంటలకే ముగియాలి. అంటే ఒక గంట ముందే పని ముగించుకుని ఇంటికి వెళ్లడం ద్వారా ఏసీలు, లైట్ల వినియోగం తగ్గుతుందని అంచనా. బ్యాంకులు కూడా మధ్యాహ్నం 3 గంటలకే కస్టమర్ సేవలను ఆపివేసి, 4 గంటల కల్లా మూతబడనున్నాయి. ఖర్చులను తగ్గించు కోవడంలో భాగంగా ప్రభుత్వం తన బడ్జెట్‌లో కోతలు విధించింది. ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన విద్యుత్, ఇంధన బడ్జెట్‌లో 30 శాతం తగ్గించాలని ఆదేశించింది. విలాసవంతమైన ఖర్చులకు చెక్ పెడుతూ కొత్తగా కార్లు, విమానాలు లేదా నౌకల కొనుగోలును పూర్తిగా నిషేధించింది.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ద్వంద్వ వైఖరికి నిదర్శనం

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** తెలంగాణలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుని వారిని గొప్పగా చూపిస్తున్న కాంగ్రెస్, కేరళంలో మాత్రం వారిపై తీవ్ర విమర్శలు చేస్తోందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు తప్పు పట్టారు. ఇటీవల ఖమ్మం సభలో కమ్యూనిస్టుల పోరాటాల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, వారి ప్రభావంతోనే పథకాలు అమలు చేస్తున్నామని చెప్పి కండువాలు కప్పుకున్న రేవంత్ రెడ్డి.. కేరళంకు వెళ్ళాక పినరయి విజయన్, మోదీ ఒక్కటేనని మతిభ్రమించినట్లు మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఒకే పార్టీ రెండు రాష్ట్రాల్లో రెండు రకాలుగా మాట్లాడటం ప్రజలను మోసం చేయడమే.కాంగ్రెస్ జాతీయ నేతలు కేరళంలో ఉన్నా, రేవంత్ రెడ్డి మాత్రం తానే "కేరళంకు గ్యారంటీ" అని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. గతంలో కర్ణాటక నేతలు వచ్చి తెలంగాణలో అమలుకు నోచుకోని గ్యారెంటీలు, హామీలతో మభ్యపెట్టి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారని పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణ నుంచి నిధులు తరలించి బీహార్, కేరళం ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడమేనన్నారు. తెలంగాణలో అమలు చేయని హామీలనే ఇప్పుడు కేరళలో ప్రకటిస్తూ అక్కడి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

## రోహిత్, రితేష్, నమిత్ మూడోరోజు విచారణ

### నేడు చంచల్‌గూడ జైలుకు తరలింపు

### మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మల రెండవ దఫా పోలీసు కస్టడీ విచారణ శుక్రవారం మూడో రోజుకు చేరింది. రాజేంద్రనగర్ కోర్టు అనుమతితో చేవెళ్ల పోలీసులు ఈ ముగ్గురిని బుధవారం కస్టడీలోకి తీసుకోవడం తెలిసిందే. అంతకు ముందు వీరిని గత నెల 24వ తేదీన మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించడం విదితమే. వీరిపై మాదకద్రవ్యాలు వాడినం దుకు, పోలీసులపై కాల్పులు జరిపినం దుకు కేసులు నమోదు చేసి నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద జైలుకు తరలించారు. వీరిని శంషాబాద్ మండ లంలోని పెద్ద షాపూర్‌లో గల శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్న పోలీసులు కీలక సమాచారం రాబట్టారని తెలిసింది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వీరిని విచారించినట్లు సమాచారం. పోలీసుల విచారణలో ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీలో రాజకీయ నాయకులతో పాటు రియల్టర్ల పాత్రపై ఆధారాలు లభించినట్లు తెలిసింది. రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో ఐదేళ్లుగా డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నాయని ఆధారాలు సేకరించిన పోలీసులు దీనికి సంబంధించిన వివరాలు కోర్టుకు సమర్పించేందుకు వీరిని మరోసారి విచారిస్తున్నారు. రెండు వారాలకు పైగా జైల్లో వున్న వీరిని మొయినాబాద్ ఫాంహౌస్‌కు తీసుకువెళ్లి పార్టీ జరిగిన రోజున ఏం జరిగిందనే దానిపై మరోసారి విచారించే వీలుంది. ఈ కేసులో డ్రగ్స్ పెడ్లర్ అభిషేక్ సింగ్ ఆచూకీ ఇప్పటి వరకు మిస్టరీగా మారింది. అతన్ని పోలీసులు అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చినా ఇది ధృవీకరణ కా లేదు. కాగా రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మల విచారణలో చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా పర్యవేక్షించారు. శనివారం ఉదయం 11 గంటల తరువాత వీరికి వైద్య పరీక్షలు పూర్తి చేసి ఆనక చంచల్‌గూడ జైలుకు తరలించ నున్నారు. వీరి విచారణకు సంబంధించి కోర్టులో వచ్చే వారం పోలీసులు నివేదిక సమర్పించనున్నారు.

## పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే మీరు మాకు నీతులు చెప్పడమా?

### సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేరళం సిఎం విజయన్ కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్3:** సొంత రాష్ట్రంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే వ్యక్తి, సామాజిక పురోగతి గురించి కేరళకు పాఠాలు చెప్పడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ కేరళ సిఎం పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. ఇటీవల కేరళలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర సర్కారుపై సిఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలపై కేరళ సిఎం పినరయి విజయన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కేరళలో అవినీతి, దుష్పరిపాలన ఉందని ఆరోపించే ముందు రేవంత్ రెడ్డి అధికారిక గణాంకాలను పరిశీలించాలని పినరయి విజయన్ సూచించారు. దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని ఆయనకు తెలియదా..? అని ప్రశ్నించారు. నీతి ఆయోగ్ ఎస్‌డీజీ ఇండెక్స్ (2023 24)లో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ ఆరో స్థానంలో ఉందని అన్నారు. మీ రాష్ట్రంలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కేరళను కించపరచడం చాలా విచారకరం అంటూ రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ విజయన్ వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారమే కేరళలో పేదరికపు రేటు కేవలం 0.55 శాతం అని, ఇది దేశంలోనే అత్యల్పమని గుర్తుచేశారు. 2025 చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలవబోతోందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణలో పేదరికం 5.88 శాతంగా ఉందని, అక్కడి నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదా..? అని ప్రశ్నించారు. కేరళలో అక్షరాస్యత 95.3 శాతం ఉండగా, తెలంగాణలో 76.9 శాతం వద్దే ఆగిపోయిందని పేర్కొన్నారు. కేరళలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) కేవలం 5గా ఉందని, ఇది అమెరికా (5.6) కన్నా మెరుగని పేర్కొన్నారు.

## విజన్ 2047లో టెక్స్‌టైల్ రంగానికి పెద్దపీట

### ఆసియా టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టెక్స్‌టైల్‌రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, అది వేలాది కుటుంబాల జీవనాధారంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. చేనేత రంగం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్న కుటుంబాల సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం టెక్స్‌టైల్ రంగాన్ని కేవలం ఆర్థిక ప్రగతిగా కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా భావిస్తోందని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో జరిగిన ఆసియా టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ చేనేత కళలను పరిరక్షిస్తూ, వాటికి ఆధునిక సాంకేతికతను జోడించి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకువెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**తెలంగాణను గ్లోబల్ టెక్స్‌టైల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు**

తెలంగాణను ప్రపంచస్థాయి టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని వివరించారు. "తెలంగాణ విజన్ 2047"లో భాగంగా టెక్స్‌టైల్ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించామని, దీంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రానికి భారీగా వచ్చిన పెట్టుబడులు తెలంగాణపై పెట్టుబడిదారుల విశ్వాసానికి నిదర్శనమని ఆయన తెలిపారు. టెక్స్‌టైల్ పార్కులు, ఎగుమతి ప్రోత్సాహక కేంద్రాలు, ఆధునిక యంత్రాంగం, మరియు సరఫరా వ్యవస్థల అభివృద్ధి ద్వారా చేనేత రంగాన్ని మరింత బలపరిచే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## కాంగ్రెస్‌తోనే ప్రజాసమస్యలు పరిష్కారం

### అసోం ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని అస్సాం ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ మేరకు అస్సాం రాష్ట్రంలోని దిబ్రూగర్ జిల్లా నహర్కటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రణతీ ఫుకాన్‌కు మద్దతుగా ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక యువత, మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రణతీ ఫుకాన్‌కు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నహర్కటియా ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో ప్రజలకు సేవలందించిన అనుభవం ఉన్న నాయకురాలు ప్రణతీ ఫుకాన్‌ను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసుల హ్యాట్రిక్ విజయం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** తెలంగాణ పోలీసు బృందాలు అల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాయి. సీఐడీ పర్యవేక్షణలో నిరంతర శిక్షణతో ఈ విజయం నమోదు చేశాయి. వరుస విజయాలతో జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు మరోసారి తమ ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర పోలీసు బృందానికి అభినందనలు తెలిపారు. డీజీపీ శివధర్ రెడ్డి,సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హాను అభినందించారు. ఈ విజయం రాష్ట్ర పోలీసుల కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ పోలీసుల విజయ పరంపర గత 3 సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2024లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2025లో ఝార్ఖండ్‌లోని రాంచీలో, 2026లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా తెలంగాణ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈసారి నాగ్‌పూర్‌లో జరిగిన 69వ పోలీస్ డ్యూటీ మీట్ లో తెలంగాణ బృందం అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీతో పాటు యాంటీసాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో విజేతగా నిలిచింది. శాస్త్రీయ దర్యాప్తు సహాయాలు, పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లో రన్నరప్ సాధించింది.

## ఆశ్రమ పాఠశాలలో కల్తీ ఆహారం

### ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** పెంచికల్ పేట్ మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో కల్తీ ఆహారం తిని ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన శుక్రవారం స్థానికంగా కలకం రేపింది. విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ ఆశ్రీన్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. అస్వస్థకు గురైన విద్యార్థులకు తక్షణమే ప్రాథమిక చికత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసు పత్రికి తరలించినట్లు, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఆశ్రీన్ మాట్లాడుతూ ఆహారం తయారీ విధానం, తాగునీటి సరఫరా, నిల్వ విధానాలను పరిశీలించారు.

## థర్మల్ కేంద్రం నుండి విద్యుత్ కొనుగోలు

### ఎట్టకేలకు తెలంగాణ పంపిణీ సంస్థల ఒప్పందం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ నుండి విద్యుత్ కొనుగోలుకై ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు స్టేజ్2 విద్యుత్తు థర్మల్ పవర్ కేంద్రం నుండి విద్యుదుత్పత్తి కొనుగోలు నిమిత్తం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి పవర్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత చూపకపోవడంతో ఆ సంస్థ యాజమాన్యం ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాలతో పవర్ పర్చేస్ అగ్రిమెంట్ (పీపీఏ) చేసుకోవడానికి ప్రయత్నించింది.




# గెలుపెవరిదో?

**ఢిల్లీ:** ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌ల్లో నెగ్గి జోరు మీదున్న ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్... నేడు అరుణ్ జైట్లీ సేటడియం వేదికగా తలపడనున్నాయి. మధ్యాహ్నం 3:30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. తమ తొలి మ్యాచ్‌లలో సాధించిన ఆత్మవిశ్వాసంతో ఇరుజట్లు ఢిల్లీ చేరాయి.

సొంత గ్రౌండ్, సొంత ప్రేక్షకుల మధ్య 221 పరుగుల లక్ష్యాన్ని ఊదేసిన హార్దిక్ టీమ్‌కు ఢిల్లీలో తొలి పరీక్ష ఎదురుకానుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థి జట్టు కంటే ముంబై పటిష్టంగా ఉంది. జోరు మీదున్న రోహిత్ శర్మ, ర్యాన్ రికల్టన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రూథర్ ఫోర్డ్ రాణిస్తే ముంబైకు తిరుగుండదు. సూపర్ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్, నమన్ ధీర్ ముంబైకు అదనపు బలం. ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా.. కోల్‌కతా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. ఈసారి వారి రాణింపుపై ముంబై భారీ ఆశలు పెట్టుకుంది.

తమ తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపొందినా బ్యాటింగ్ వైఫల్యం ఆందోళన పరుస్తోంది. నిస్సాంక, రాహుల్, అక్షర్, నితిష్ రాణా, ట్రిస్టన్ స్టబ్స్ గాడిన పడితే పరుగులు ఆశించవచ్చు. గత మ్యాచ్‌లో ఒంటరిపోరాటంతో ఢిల్లీకి విజయం అందించిన సమీర్ రిజ్వీపై మరోసారి ఆశలు పెట్టుకుంది. కుల్దీప్, అక్షర్, ఎన్గిడి, నటరాజన్ ఎంతవరకు ముంబై బ్యాట్స్‌మెన్‌ను కట్టడిచేస్తారన్న దానిపై నే ఢిల్లీ గెలుపోట ములు ఆధారపడి ఉన్నాయి.

**పిచ్ రిపోర్ట్ :** అరుణ్ జైట్లీ సేడియంలో జరిగిన జరిగిన ఏడు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో మొదట బ్యాటింగ్ చేసిన జట్లే గెలిచాయి. పిచ్ స్ట్రోక్ ప్లేకు అనుకూలంగా ఉన్నప్పటికీ, ఇన్నింగ్స్ కొనసాగేకొద్దీ బౌలర్లకు సహకరిస్తుంది.

**హెడ్ టు హెడ్:** ఇరు జుట్లు ఇప్పటివరకు 37 మ్యాచ్‌లు ఆడగా ముంబై పైచేయి సాధించింది. ముంబై ఇండియన్స్ 21 మ్యాచ్‌ల్లో, ఢిల్లీ క్యాపిటల్స్ 16 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. సొంత గ్రౌండ్‌లో మాత్రం ఢిల్లీదే పైచేయి. 13మ్యాచ్‌లలో ఢిల్లీ క్యాపిటల్స్ ఏడింటిలో నెగ్గింది.

**ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టు(అంచనా):** పాతుమ్ నిస్సాంక, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్ (కెప్టెన్), నితీష్ రాణా, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ మిల్లర్, లుంగ్గి ఎన్గిడి, కుల్దీప్ యాదవ్, నటరాజన్, ముఖేష్ కుమార్

**ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా):** ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), రోహిత్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), శార్దూల్ ఠాకూర్, నమన్ ధీర్, ఘజన్‌ఫర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా

# చేపాక్‌లోనూ చెన్నై ధమాల్

**చెన్నై:** సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ కుర్రాళ్లు కుమ్మేశారు. చెపాక్‌లో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రే (73) అర్థ శతకంతో కదం తొక్కగా.. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు సర్ఫరాజ్ ఖాన్(32) దడ పుట్టించాడు. మాత్రే మెరుపులతో డీలా పడిన ప్రత్యర్థిని డెత్ ఓవర్లలో శివం దూబే (45 నాటౌట్) మరింత కుంగదీసేలా బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ ముగ్గురి విధ్వంసంతో రెండొందలు కొట్టిన చెన్నైకు ఆ స్కోరు కూడా నిలబడలేదు. చేపాక్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్‌కు నిరాశే ఎదురైంది.

210 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్... మరో 8 బంతులుండగానే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ప్రియాన్ష్ ఆర్య(11 బంతుల్లో 39) మెరుపు దాడితో ప్రారంభమైన పంజాబ్ చేజింగ్ ప్రభుసిమ్రాన్ సింగ్(34 బంతుల్లో 43), కూపర్ కానలే(22 బంతుల్లో 36), శ్రేయాస్ అయ్యర్(24 బంతుల్లో 46), నేహాల్ వధేరా(13) వరకూ కొనసాగింది. ఖలీల్ బంతులను ఫోర్, సిక్స్‌లతో ఇన్నింగ్స్ ఆరంభించిన ప్రియాన్ష్ ఆర్య... ఆ తర్వాత మాట్ హెన్రీ ఓవర్లో 4, 6, 4తో 20 రన్స్ సాధించాడు. కంబోజ్‌పై ప్రభు సిమ్రాన్ మూడు ఫోర్లతో అటాక్ చేశాడు. ఈ విధంగా వచ్చిన బ్యాట్స్‌మెన్ వచ్చినట్టే చెన్నై బౌలర్లపై విరుచుకుపడడంతో 200 ప్లస్ లక్ష్యం కూడా చిన్నబోయింది. ముఖ్యంగా శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 29 బంతుల్లోనే 3 సిక్స్‌లు, 4 ఫోర్లతో అర్థసెంచరీ సాధించి అవుటయ్యాడు. మిగతా పనిని శశాంక్ సింగ్, స్టోయినీస్ పూర్తి చేసి పంజాబ్‌కు గెలుపందించారు.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కేకు ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో విఫలమైన ఓపెనర్ సంజూ శాంసన్(7) చెపాక్‌లోనూ నిరాశపరిచాడు. అయినా చెన్నై ఆటగాళ్లు ఒత్తిడిలో పడకుండా పంజాబ్ కింగ్స్ బౌలర్ల భరతం పట్టారు. అండర్ 19 వరల్డ్‌కప్ కెప్టెన్ ఆయుష్ మాత్రే(73), రుతురాజ్ గైక్వాడ్(28)తో కలిసి చెలరేగిపోయాడు. హ్యాట్రిక్ ఫోర్లతో.. భారీ సిక్సర్లతో అలరించిన మాత్రే 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో వికెట్‌కు 55 బంతుల్లో 96 రన్స్ జోడించాడు. గైక్వాడ్‌ను అవుట్ చేయడం ద్వారా ఈ జోడీని చాహల్ విడదీశాడు.

ఆసంతోషం ఎంతోసేపు నిలవలేదు. శివమ్ దూబే(45) తన స్టయిల్లో బౌండరీలు బాదాడు. మరోవైపు 43 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 73 పరుగులు చేసిన ఆయుష్ మాత్రే.. వైశాఖ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. కార్తీక్ శర్మ ఒక పరుగుకే చేసి పెవిలియన్ చేరాడు.

ఈ దశలో శివమ్ దూబే, సర్ఫరాజ్ ఖాన్... పంజాబ్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. సర్ఫరాజ్ 12 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్స్‌తో 32 రన్స్‌తో రాణించాడు. అర్షదీప్ వేసిన చివరి ఓవర్లో శివమ్ దూబే వరుసగా మూడు ఫోర్లు కొట్టి సీఎస్‌కే స్కోరును 200 మార్కు దాటించాడు. దీంతో చెన్నై 20ఓవర్లలో 5 వికెట్లకు 209 రన్స్ చేసింది. పంజాబ్ బౌలర్లలో వైశాఖ్ 2 వికెట్లు పడగొట్టగా, బార్లెట్, జాన్సెన్, యజవేంద్ర చాహల్ తలా ఓ వికెట్ తీశారు.



# సెమీస్‌లో నిఖత్ జరీన్ మెడల్ గ్యారంటీ

హైదరాబాద్, ఏప్రిల్ 3(వార్త క్రీడా ప్రతినిధి): తెలంగాణ బాక్సర్, మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్.. మంగోలియాలో జరుగుతున్న ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం చేసుకుంది. 51 కిలోల కేటగిరిలో సెమీస్‌లో ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్‌లో ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాన్ బగుహిన్‌పై విజయం సాధించింది. తొలి రౌండ్‌లో బై పొందిన జరీన... క్వార్టర్స్‌లో ఆధిపత్యం ప్రదర్శించింది. ఎటాకింగ్ గేము ఆడుతూ ప్రత్యర్థిపై పిడుగుద్దులు కురిపించింది. దీంతో రిఫరీ తొలి రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపివేసి నిఖత్ గెలిచినట్టు ప్రకటించారు. అయితే సెమీస్‌లో నిఖత్‌కు గట్టి సవాలే ఎదురుకానుంది. పారిస్ ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్, చైనా బాక్సర్ వు యూతో తలపడనుంది. ఒకవేళ సెమీస్‌లో ఓడితే కనీసం కాంస్యం గెలుస్తుంది. భారత బాక్సర్లు 60 కేజీల కేటగిరీలో ప్రియా ఘంఘస్, 54 కేజీల కేటగిరీలో ప్రీతి పవార్ కూడా సెమీస్‌కు చేరుకుని పతకాన్ని ఖాయం చేసుకున్నారు.

# పురుషుల సెమీస్‌లో సిఐఎస్ఎఫ్, ఒడిశా

**హైదరాబాద్, ఏప్రిల్ 3(వార్త క్రీడా ప్రతినిధి):** 74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పరుషుల విభాగంలో క్వార్టర్ ఫైనల్ స్టేజ్ ముగిసింది. సిఐఎస్ఎఫ్, ఒడిశా, గోవా, కేరళం జట్లు సెమీఫైనల్లో ప్రవేశించాయి. తొలి క్వార్టర్ ఫైనల్లో టాప్ ఫేవరెట్ సిఐఎస్ఎఫ్ జట్టు 4-0 గోల్స్ తేడాతో అసోం రైఫిల్స్‌పై గెలుపొందింది. శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సిఐఎస్ఎఫ్ ఫార్వర్డ్స్... అసోం రైఫిల్ గోల్ పోస్ట్‌పై పదేపదే దాడులకు దిగారు. ఈ అటాకింగ్ గేమ్ విజయవంతమైంది. ఒకటివెంట ఒకటిగా నాలుగు గోల్స్ సాధించారు. మరోవైపు అసోం రైఫిల్ గోల్ చేయడంలో విఫలమైంది. ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఒడిశా 6-4 గోల్స్ తేడాతో ఐటిబిపిపై, గోవా 1-0 గోల్‌తో సిఆర్‌పిఎఫ్‌పై, కేరళ 5-1 గోల్స్ తేడాతో సిక్కింపై గెలుపొంది సెమీఫైనల్ చేరాయి. నేడు జరిగే తొలి సెమీఫైనల్లో సిఐఎస్ఎఫ్, ఒడిశా జట్లు... రెండో సెమీఫైనల్లో గోవా, కేరళం జట్లు తలపడతాయి. మహిళల ఫైనల్లో అసోం రైఫిల్‌తో ఒడిశా తలపడనుంది. పురుషుల విభాగం ఫైనల్ ఆదివారం గచ్చిబౌలిలో జరగనుంది.




గుజరాత్‌పైనే శతకంతో వెలుగులోకి వైభవ్

# అమ్మాదాబాద్‌లో పవర్ ప్లే తప్పదా?

**ఆహ్మదాబాద్:** గుజరాత్ టైటాన్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మరో ఉత్కంఠ పోరుకు ఆహ్మదాబాద్ వేదిక కానుంది. రెండు జట్లలోనూ హార్డ్ హిట్టర్లు ఉండ దంతో మ్యాచ్‌లో పరుగుల వరద ఖాయం. రాజస్థాన్ రాయల్స్ భారీ విజయం తో ఈమ్యాచ్ కోసం ఎదురుచూస్తుండగా... గుజరాత్ హోంగ్రౌండ్‌లో నైనా గెలుపు బోణీ చేయాలని ఉవ్విళూరుతోంది.

గత ఏడాది ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లోనే వైభవ్ సూర్యవంశీ లైమ్‌లైట్‌లోకి వచ్చాడు. 35 బంతుల్లోనే శతకం బాదాడు. అక్కడినుండి తగ్గకుండా బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. మెరుపు హాఫ్ సెంచరీతో 2026 సీజన్‌ను గ్రాండ్‌గా ఆరంభించాడు. మరోవైపు యశస్వి జైస్వాల్, ధృవ్ జురెల్, షిమ్రాన్ హెట్మెర్, రవీంద్ర జడేజా రూపంలో స్ట్రాంగ్ బ్యాటింగ్ లైనప్ ఉంది. జడేజా స్పిన్ బౌలింగ్ అదనపు బలం. జోఫ్రా అర్చర్, సందీప్ శర్మ, బర్గర్ లాంటి మేటి పేస్ అటాక్ ఉంది.

గుజరాత్ టైటాన్స్‌కు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ రూపంలో చక్కని ఓపెనర్లు ఉన్నారు. గత ఏడాది ఈ జోడీ 159.33 స్ట్రయిక్ రేట్‌తో 912 రన్స్ సాధించారు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా... ట్రాక్‌లో పడితే వీరిని ఆపడం కష్టం. మిగతా బాట్స్‌మెన్ కూడా రాణిస్తే భారీ స్కోరుపై ఆశలు ఉంటాయి. బట్లర్ ఫామ్‌లోకి రావాలని ఆశిస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ చక్కగా బౌలింగ్ చేశాడు. రషీద్ ఖాన్ అనుకున్నంత మేర రాణించలేకపోయాడు. అయితే రబడ స్థానంలో జేసన్ హోల్డర్‌ను జట్టులోకి తీసుకుని బ్యాటింగ్ బలం కూడా పెచాలన్న లక్ష్యంతో గుజరాత్ ఉంది.




**పిచ్ రిపోర్ట్ :** సీజన్ ఐపీఎల్‌లో అహ్మదాబాద్ అత్యధిక స్కోరింగ్ వేదికగా నిలిచింది, ఇక్కడ 200కి పైగా స్కోర్లు 11 సార్లు నమోదయ్యాయి. మొదట బ్యాటింగ్ చేసే జట్టుకు అనుకూలం. గత 6మ్యాచ్‌ల్లో నాలుగింటిలో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు గెలుపొందింది. ఈసారి కూడా రిపీట్ కావచ్చు.

**రెండు జట్ల వివరాలు**

**గుజరాత్ టైటాన్స్ తది జట్టు(అంచనా):** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), సాయి సుదర్శన్, జాస్ బట్లర్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, షారూఖ్ ఖాన్, రాహుల్ తెవాటియా, రషీద్‌ఖాన్, కగిసో రబడ/జేసన్ హోల్డర్, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్

**రాజస్థాన్ రాయల్స్ తుది జట్టు(అంచనా):** వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్(కెప్టెన్), షిమ్రాన్ హెట్మెర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా అర్చర్, నండ్రే బర్గర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్

# కళతప్పిన విదేశీ కరెన్సీ ఖజానా




**ముంబయి, ఏప్రిల్ 3:** భారత విదేశీ మారక నిల్వలు గతనెల 27తో ముగిసిన వారంలో 10.28 బిలియన్ తగ్గి 688.05 బిలియన్‌కు చేరాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం విడుదలచేసిన గణాంకాలను గమనిస్తే విదేశీ కరెన్సీ రిజర్వులు తగ్గాయి. అంతకుముందు వారంలో మొత్తం నిల్వలు 11.413 బిలియన్ డాలర్లు తగ్గి 698.346 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో, పశ్చిమ ఆసియా ఘర్షణ ప్రారంభానికి ముందు, విదేశీ మారక నిల్వలు అత్యధిక స్థాయి 728.494 బిలియన్‌డాలర్లకు పెరిగాయి. అయితే గతనెల 27తో ముగిసిన వారంలో, నిల్వలలో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 6.622 బిలియన్ తగ్గి 551.072 బిలియన్‌కు చేరాయని కేంద్ర బ్యాంకు డేటా చెపుతోంది. డాలర్లలో వర్గీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులు, యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువ పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావాలను కూడా కలిగి ఉంటాయి. ఈ వారంలో బంగారు నిల్వల విలువ 3.666 బిలియన్ తగ్గి 113.521 బిలియన్‌కు పడిపోయిందని ఆర్బీఐతెలిపింది. ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు ఎస్‌డిఆర్‌లు 17 మిలియన్ డాలర్లు పెరిగి 18.649 బిలియన్‌డాలర్లకు చేరాయని సెంట్రల్‌బ్యాంకు పేర్కొంది. అదేవిధంగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత దేశం రిజర్వ్ స్థానం కూడా నివేదిక వారంలో 17 మిలియన్ డాలర్లు పెరిగి 4.816 బిలియన్‌డాలర్లకు చేరిందని కేంద్ర బ్యాంకు ప్రకటించింది.



## ప్యాసింజర్ వాహనాల్లో

# 6శాతం సేల్స్ వృద్ధి

**ముంబయి, ఏప్రిల్ 3:** భారత్‌లో ప్యాసింజర్ వాహనాల రంగం వృద్ధి 2027 ఆర్థికసంవత్సరంలో 4నుంచి 6శాతానికి పెరుగుతుందని ఇక్రా రేటింగ్స్ ఏజెన్సీ అంచనావేసింది. 2026 సంవత్సరంలో ఈ రంగం హోల్‌సేల్ అమ్మకాల వృద్ధిని 7-9శాతంవరకూ నమోదుచేసింది. పండుగల సీజన్, జిఎస్టీ రేట్‌కట్స్ వంటివాటితోపాటు అనేక కొత్తమోడళ్లు ప్రారంభించడం కూడా ఒకింత మేలు జరిగిందని ఇక్రా అంచనావేసింది. మొత్తం అమ్మకాల్లో 67శాతం యుఇటిలిటీ వాహనాలే ఎక్కువ అమ్మకాలు సాగాయి. వీటితోపాటు ప్రత్యామ్నాయంగా పవర్‌ట్రైన్స్ సిఎన్‌జి, విద్యుత్ వాహణాలుకూడా కొంత అమ్మకాలు పెరగడంతో సేల్స్ పెరిగినట్లు అంచనా వేసింది. అదే సమయంలో ట్రాక్టర్ రంగం కూడా 1-4 శాతానికి అమ్మకాలు పెరిగాయి. డిమాండ్ సహజ స్థాయిలోనే ఉన్నా ట్రాక్టర్ల రంగంలో కొంతమేర అమ్మకాలు పెరిగాయి. టోకు అమ్మకాలు 22.8శాతం పెరిగాయి. 2026 ఆర్థికసంవత్సరం 11నెలల్లోనే ట్రాక్టర్లకు గణనీయంగా మార్కెట్‌ఫరిగిందని ఇక్రా అంచనావేసింది. రుతుపవనాల తీరు ఆధారంగా ట్రాక్టర్ల రంగంలో డిమాండ్ పెరుగుతుందని ఇక్రాఅంచనావేసింది.

గ్రామీణుల్లో పెరుగుతున్న ఆదాయవనరులు, ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా ట్రాక్టర్ల మార్కెట్ ఆధారపడి ఉంటుందని ఇక్రయా తేటతెల్లం చేసింది. అందువల్లనే ముఖ్యంగా వ్యవసాయ రంగం ఎక్కువ ఉన్న గ్రామీణ ప్రాంతాలకే ట్రాక్టర్ల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

# ఛార్జీలు పెంచేసిన విమాన సంస్థలు

**చెన్నై, ఏప్రిల్ 3:** విమాన సంస్థలు చార్జీలను ఒక్కసారిగా పెంచేశాయి. చెన్నై నుంచి తూత్తుకుడి, మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, సేలం, కొచ్చి, బెంగుళూరు, హైదరాబాద్‌తో పాటు పలు ఉత్తరాది నగరాలకు వెళ్ళే విమానాల్లో చార్జీలు విపరీతంగా పెంచేశారు. చెన్నై తూత్తుకుడి ప్రాంతాల మధ్య కనిష్టంగా రూ.6,503గా ఉండే ప్రయాణ చార్జీ ఇపుడు రూ.17,021కి చేరింది. చెన్నై మదురై మధ్య రూ.13,147 (సాధారణ రోజుల్లో రూ.5,467), చెన్నై తిరుచ్చి మధ్య రూ.5,619, చెన్నైకోవై మధ్య రూ.16,496 (రూ.4,966), చెన్నై సేలం మధ్య రూ.5,051, చెనై కొచ్చిన్ మధ్య రూ.18,071 (రూ.4,840), చెన్నై బెంగళూరు మధ్య రూ.16,496 (రూ.3,071), చెన్నై హైదరాబాద్ మధ్య రూ.19,453 (రూ.4,779)మేర పెంచేశారు. అయినా కూడా చాలామంది విమాన ప్రయాణాలకు ఆసక్తి చూపడంతో విమానాశ్రయాల్లో విపరీతమైన రద్దీ నెలకొంది.

ఈ కారణంగా ఎయిర్‌పోర్టుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటుచేసి, నిఘా పెంచారు. తిరుచ్చి విమానాశ్రయం నుంచి మలేసియా, సింగపూర్, మస్కట్, ఒమన్, దుబాయ్, అబుదాబి తదితర దేశాలకు విమాన సేవలు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఆ దేశాలకు విమాన సేవలు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో, తిరుచ్చి నుంచి సౌదీ మీదుగా కువైట్‌కు కొత్త విమాన సేవలు నడుపనున్నట్లు జెజీరా విమాన సంస్థ ప్రకటించింది. ఈ ప్రకారం, ఈ నెల 7వ తేది నుంచి మంగళ, ఆదివారాల్లో రాత్రి 8.25 గంటలకు కువైట్ నుంచి బయల్దేరే విమానం తిరుచ్చి విమానాశ్రయానికి ఉదయం 4.40 గంటలకు వచ్చి చేరుతుంది.



మరుమార్గంలో, తిరుచ్చి విమానాశ్రయం నుంచి బుధ, ఆదివారాల్లో ఉదయం 5.25 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 8.25 గంటలకు కువైట్ చేరుకుంటుందని సంస్థ తెలిపింది.

# మార్కెట్లోకి ఐదు కిలోల సిలిండర్లు

**ముంబయి, ఏప్రిల్ 3:** గ్యాస్ సిలిండర్లలో ఇప్పటివరకు ఉన్న 14.2 కిలోల సిలిండర్, హోటల్స్, రెస్టారెంట్ల లాంటి వ్యాపారాలకు వాడే 19 కిలోల సిలిండర్‌లకు తోడు ఇపుడు కొత్తగా ఐదు కిలోల సిలిండర్లుకూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇప్పుడు 5 కిలోల సిలిండర్లు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. ఈ మేరకు అన్ని గ్యాస్ కంపెనీలు 5 కేజీలలో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్ పీ గ్యాస్ కంపెనీలన్నీ ఈ చిన్న సిలిండర్లను మార్కెట్లోకి తెచ్చాయి. అద్దె ఇళ్లల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, వలస కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలంటే అడ్రస్ ప్రూఫ్ అవసరమయ్యేది. 5 కిలోల గ్యాస్ సిలిండర్ తీసుకోవాలంటే ఎలాంటి అడ్రస్ ప్రూఫ్ సమర్పించాల్సిన అవసరమే లేదు. ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. ఏ గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి అయినా అప్పటికప్పుడు తీసుకుని వెళ్లవచ్చు. గ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్‌కు ముందే బుక్ చేసుకుంటే ఇంటికి రావడానికి సమయం పడుతుంది. అదే ఈ చిన్న సిలిండర్‌ను మీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి లేదా సమీపంలోని దుకాణాల్లో సులువుగా రీఫిల్లింగ్ చేసుకోవచ్చు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛోటు పేరుతో 5 కేజీల సిలిండర్ లాంచ్ చేసింది. పెట్రోలు బంకులుపంపుల్, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఇండేన్ పంపిణీదారుల వద్ద దీనిని కొనుగోలు చేయవచ్చు. ఇక భారత్ గ్యాస్ మినీ సిలిండర్ అయితే మీ ఇంటి వద్దకే వచ్చేస్తుంది. 1800224344 నెంబర్‌కు కాల్ చేస్తే రెండు గంటల్లోనే మీ ఇంటికి డెలివరీ చేస్తారు . అయితే రూ.25 డెలివరీ ఛార్జీ కట్టాల్సి ఉంటుంది. ఇక హెచ్ పీ గ్యాస్ అప్పు పేరుతో 5 కేజీ ల సిలిండర్ ప్రవేశపెట్టింది. పెట్రోల్ బంక్‌లు, విక్రయ కేంద్రాలు, కిరాణా దుకాణాల్లో అందుబాటులోకి తెచ్చింది.






# భారీగా తగ్గనున్న ల్యాండ్‌రోవర్ ధరలు

**లండన్, ఏప్రిల్ 3:** భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ప్రభావంతో లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్.. తమ కార్ల ధరలను గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయంతో కొన్ని టాప్‌ఎండ్ రేంజ్ రోవర్ మోడళ్ల ధరలు ఏకంగా కోటి రూపాయలకు పైగా తగ్గే అవకాశం ఉంది. గతేడాది జులైలో భారత్, యూకే మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రకారం యూకే నుంచి పూర్తిస్థాయిలో తయారై దిగుమతి అయ్యే కార్లపై (సీబీయూ)దిగుమతి సుంకం మొదటి ఏడాదిలో 110 శాతం నుంచి 30 శాతానికి తగ్గనుంది. దీనివల్ల బాలీవుడ్ ప్రముఖులు అలియా భట్, రణ్‌వీర్ సింగ్, సోనమ్ కపూర్ వంటి వారు ఎక్కువగా ఇష్టపడే రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ, ఎస్‌వీ ఎడిషన్ల వంటి హైఎండ్ వేరియంట్ల ధరలు భారీగా తగ్గనున్నాయి. నివేదికల ప్రకారం ఈ కార్ల ధరలు 13 నుంచి 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఉదాహరణకు ప్రస్తుతం రూ. 2.75 కోట్లుగా ఉన్న రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్‌వీ ఎడిషన్ టూ ధర రూ.2.35 కోట్లకు చేరవచ్చు. అదేవిధంగా రూ. 4.25 కోట్ల విలువైన రేంజ్ రోవర్ 4.4లీటర్ పెట్రోల్ ఎస్‌వీ మోడల్ ధర రూ. 3.19 కోట్లకు దిగిరావచ్చని అంచనా. దేశీయంగా అసెంబుల్ చేసే మోడళ్లకు ఈ తగ్గింపు వర్తించదు.

అయితే, ఈ ధరల తగ్గింపు కేవలం యూకే నుంచి దిగుమతి చేసుకునే ఎస్‌వీ మోడళ్లకు మాత్రమే వర్తిస్తుంది. పూణెలోని ప్లాంట్‌లో విడిభాగాలను (సీకేడీ) తెచ్చి అసెంబుల్ చేసే రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్, వెలార్, డిస్కవరీ స్పోర్ట్ వంటి మోడళ్లపై ఈ ప్రభావం ఉండదు. అలాగే, స్లోవేకియాలో తయారయ్యే డిఫెండర్ మోడల్ ధరలో కూడా మార్పు ఉండదు. ప్రస్తుతం భారత లగ్జరీ కార్ల మార్కెట్‌లో 25 శాతం వాటాను కలిగి ఉన్న జేఎల్ఆర్.. ఈ ధరల తగ్గింపుతో మెర్సిడెస్, బీఎండబ్ల్యూ వంటి ప్రత్యర్థి సంస్థలపై పోటీలో మరింత పట్టు సాధించనుంది.

# ఐడియా,ఎయిర్‌టెల్‌కు పెరుగుతున్న కొత్త కస్టమర్లు

**ముంబయి, ఏప్రిల్ 3:** భారత టెలికం రంగంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ తన సబ్‌స్క్రైబర్ల సంఖ్యను నిలకడగా పెంచుకుంటూ దూసుకెళ్తుండగా, తీవ్ర నష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా (వీఐ)కు కాస్త ఊరట లభించింది. రిలయన్స్ జియో మాత్రం అగ్రస్థానంలో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతోంది. గత కొన్ని నెలలుగా భారతీ ఎయిర్‌టెల్ నిలకడైన వృద్ధిని ప్రదర్శిస్తోంది. మెషిన్‌టుమెషిన్ కనెక్షన్లతో పాటు, వాటిని మినహాయించి ఎయిర్‌టెల్ నికరంగా వినియోగదారులను పెంచుకుంటూ వస్తుండటం గమనార్హం. విస్తృతమైన సేవలతో కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడంలో సంస్థ దూకుడుగా ఉంది. మరోవైపు, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వొడాఫోన్ ఐడియాకు ఊరటనిచ్చే వార్త వెలువడింది. గత జూలై తర్వాత తొలిసారిగా ఫిబ్రవరి నెలలో ఈ సంస్థ నికరంగా 22,000 మంది కొత్త సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుంది. వినియోగదారుల తగ్గుదలను అరికట్టేందుకు సంస్థ అమలు చేస్తున్న వ్యూహాలు స్వల్పంగానైనా ఫలితాలనిస్తున్నాయని ఇది సూచిస్తోంది. ఇక దేశంలోనే అతిపెద్ద టెలికం సంస్థగా రిలయన్స్ జియో తన స్థానాన్ని పదిలంగా ఉంచుకుంది. ఇప్పటికే భారీ సంఖ్యలో ఖాతాదారులు ఉండటం వల్ల (బేస్ ఎఫెక్ట్) కొత్తగా చేరే వారి సంఖ్య వృద్ధి పరంగా తక్కువగా కనిపిస్తోంది. మొత్తం మీద టెలికం మార్కెట్‌లో పోటీ తీవ్రంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.